RNI No.TELTEL/2005/16755

ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 30 అక్టోబర్ 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:130

తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కండి

2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ తెలంగాణ

పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు నాది భరోసా

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కు పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం

ఢిల్లీ: తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కావాలని అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలుస్తుందని, రాష్ట్రంలో పెట్టే ప్రతి పెట్టుబడికి తనది భరోసా అని సీఎం హామీ ఇచ్చారు. హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సన్నాహక కార్యక్రమాన్ని ఢిల్లీలో గురువారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర మంత్రులు రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, అంతర్జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తలు, విధాన నిర్ణేతలు, అధికారులు పాల్గొన్నారు.

సన్నాహక కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన విధాన నిర్ణయాలు, ప్రభుత్వ సహకారం అందించేందుకు తాను వ్యక్తిగతంగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌కు నాలుగు వందల ఏళ్ల క్రితమే ప్రపంచ నగరంగా గుర్తింపు ఉందని సీఎం తెలిపారు. ప్రపంచీకరణ అనే మాట ప్రాచుర్యంలోకి రాకముందే అనేక దేశాల నుంచి వ్యాపారులు హైదరాబాద్‌కు వచ్చి వ్యాపారాలు చేసేవారని గుర్తు చేశారు. చార్మినార్ పరిసరాల్లో ముత్యాలు, సుగంధ ద్రవ్యాలు, నఖాసీ వస్తువుల వ్యాపారం జరిగేదని గుర్తు చేశారు.

మిగతా 2 లో

గోదావరి పుష్కరాలకు ముందే.. భద్రాద్రి దేవస్థాన అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం

ప్రతివారం అధికారుల సమీక్షతో.. వేగవంతమైన మార్పు

ప్రస్తుతం స్లాబ్ నిర్మాణాలు పూర్తి.. నవంబర్ లో రాతి నిర్మాణాలకు శ్రీకారం

రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

భద్రాచల దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అభివృద్ధి పనుల పరిశీలన

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 29:ప్రస్తుతం భద్రాచల దేవస్థాన అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఇదే స్పీడుతో ముందుకెళితే గోదావరి పుష్కరాలకు పది రోజుల ముందే భద్రాద్రి దేవస్థానం సిద్ధమవుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట లతో కలిసి దమ్మక్క అన్నదాన సత్రం నుంచి మెట్ల దారి వరకు.. దేవస్థానం చుట్టూ కలియతిరిగి నేరుగా పనులను పరిశీలించారు.

మిగతా 2 లో

అమిత్ షా జీ మహాపాదయాత్ర, ఎమ్మెల్సీ ఓటరు నమోదు, జీహెచ్ఎంసీ ఎన్నికల సన్నద్ధతపై బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కీలక సమావేశం

హైదరాబాద్ । అక్టోబర్ 29, 2026 బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర సహ ఇన్‌ఛార్జ్ అభయ్ పటేల్ జీ సమావేశాన్ని నిర్వహించి, పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి టి. ఉమామహేంద్ర జీ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఎంపీ డా. కె. లక్ష్మణ్ జీ పాల్గొన్నారు.

ఈ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా జీ రానున్న మహాపాదయాత్ర ఏర్పాట్లపై ప్రధానంగా చర్చించారు. ఈ మహాపాదయాత్ర 2026 నవంబర్ 2వ తేదీ మధ్యాహ్నం 2:00 గంటలకు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ప్రారంభమై మోజాంజాహీ మార్కెట్ ఎక్స్ రోడ్స్ వరకు కొనసాగనుంది.

అలాగే ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం, రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల సన్నద్ధత, పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయిలో సమన్వయం వంటి అంశాలపై చర్చించారు.

ఈ సమావేశంలో డా. గౌతమ్ రావు (బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి), మహిపాల్ రెడ్డి (బీజేపీ రాష్ట్ర కార్యదర్శి), ప్రేమ్ సింగ్ రాథోడ్ (మాజీ ఎమ్మెల్యే), శంకర్ యాదవ్ (జీహెచ్ఎంసీ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్), లాల్ సింగ్ (మాజీ కార్పొరేటర్), పాండు యాదవ్, గోవింద్ రాఠీ, పాశం సురేందర్, శ్రీరామ్ వ్యాస్ తదితర నాయకులు పాల్గొన్నారు. రాబోయే మహాపాదయాత్రతో పాటు ఎమ్మెల్సీ ఓటరు నమోదు, జీహెచ్ఎంసీ ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు నాయకులు చర్చించారు.

తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యం సాధ్యమే తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సంపూర్ణ సహకారం

ఫార్మా, ఏరోస్పేస్, ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ రంగాల్లో అపార అవకాశాలు

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్‌లో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

ఢిల్లీ: తెలంగాణ నిర్దేశించుకున్న 'తెలంగాణ రైజింగ్--2047' లక్ష్యం సవాలుతో కూడుకున్నదే అయినప్పటికీ.. సమష్టి కృషితో దానిని సాధించవచ్చునికేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందన్నారు.

రాష్ట్రంలో ఫార్మా, అంతరిక్షం, ఏరోస్పేస్, రక్షణ, ఎలక్ట్రానిక్స్, కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం కంప్యూటింగ్, ఆహార శుద్ధి, పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో విస్తృత అవకాశాలున్నాయని చెప్పారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి మాట్లాడుతూ పెట్టుబడులు పెట్టే ముందు పారిశ్రామికవేత్తలు ప్రధానంగా ఆశించేది విధానాల్లో స్థిరత్వం, నిబంధనల్లో స్పష్టత, వ్యాపార నిర్వహణలో పారదర్శకతేనని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు.

మిగతా 3 లో

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లకుండా లక్షిత వర్గాలకే వినియోగించాలి

అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందాలి

ఆవాసాల్లో మౌలిక సదుపాయాలు.. గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణ

అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దిశానిర్దేశం

హైదరాబాద్, అక్టోబరు 29: ఎస్సీ, ఎస్టీల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి ఉద్దేశించిన ప్రత్యేక అభివృద్ధి నిధులను సమర్థవంతంగా వినియోగించి, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఇరువురు మంత్రులు సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు నిర్దేశిత లక్ష్యాలకు మాత్రమే వినియోగించేలా పటిష్ఠమైన పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం వ్యవసాయం, ఇంధనం, వైద్య ఆరోగ్యం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక తదితర శాఖల్లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

ఈ సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. నిధులు దారి మళ్లకుండా పకడ్బందీ చర్యలు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను గత ప్రభుత్వాల మాదిరిగా ఇతర అవసరాలకు మళ్లించే పరిస్థితి ఇకపై ఉండకూడదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేసినట్లు సమావేశంలో అధికారులు, సంబంధిత శాఖలకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కేటాయించిన నిధులను లక్షిత వర్గాల సంక్షేమం, అభివృద్ధికే వినియోగించాలనే స్పష్టమైన విధానంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.సబ్‌ప్లాన్ కింద కేటాయించిన ప్రతి రూపాయి ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి ఉపయోగపడేలా శాఖల వారీగా వ్యయం, లబ్ధిదారుల వివరాలు, భౌతిక పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు.

మిగతా 2 లో

ఉస్మానియా జనరల్ హాస్పిటల్ నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి మంత్రి దామోదర్ రాజనర్సింహా

నిమ్స్ ఎక్స్‌పాన్షన్ ప్రాజెక్ట్, గోషామహల్‌లో నిర్మిస్తున్న ఉస్మానియా జనరల్ హాస్పిటల్ నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ రెండు కీలక ప్రాజెక్టుల నిర్మాణ పనుల పురోగతిపై గురువారం సెక్రటేరియట్‌లో మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాజెక్టుల కింద ఇప్పటివరకు చేపట్టిన నిర్మాణ పనుల పురోగతి, తదుపరి చేపట్టాల్సిన పనులపై మంత్రి అధికారులతో చర్చించారు. గోషామహల్‌లో ఉస్మానియా జనరల్ హాస్పిటల్ నూతన భవన నిర్మాణ పనులు 23 శాతం పూర్తయ్యాయని, నిమ్స్ ఎక్స్‌పాన్షన్ ప్రాజెక్ట్‌లో భాగంగా భవన నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు.

మిగతా 3 లో

ప్రజాబలం

30 అక్టోంబర్ 2026 శుక్రవారం

చదువుల వెనుక కార్పొరేట్ గ్రీడ్

ప్రాణం పోసే ఆసుపత్రి బాధ్యత మరిచిపోయి కార్పొరేట్ బిజినెస్ సెంటర్ గా మారిపోతే... మెడిసిన్స్ అమ్మాల్సిన మెడికల్ షాపు కసాయి దుకాణంగా రూపాంతరం చెందితే పరిస్థితి ఎంత ఘోరంగా ఉంటుందో చెప్పడానికి తాజాగా సుప్రీంకోర్టులో జరిగిన ఈ లీగల్ వార్ఫేరే ప్రత్యక్ష సాక్ష్యం. రూ. 11 వేల క్యాన్సర్ ఇంజెక్షన్ కోసం ఏకంగా రూ. 1,30,000 వసూలు చేయడం, రూ. 15 సెలైన్ డ్రిప్ లైన్ కోసం రూ. 250 పిండడం వంటి సంఘటనలు మన దేశంలోని కార్పొరేట్ హాస్పిటల్స్ చేస్తున్న రియల్ రోడ్‌సైడ్ రాబరీకి అద్దం పడుతున్నాయి. బాధితుడు స్వయంగా ఆ మందులు పంపిణీ చేసే డీలర్ అయి ఉండి, "సార్, నేనే ఈ మందులు సప్లై చేస్తాను, నన్ను కాపాడండి, నా దగ్గరున్న ఇంజెక్షనే వాడండి" అని కాళ్లావేళ్లా పడినా కరగని కార్పొరేట్ రాయి లాంటి మనస్తత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా ఎండగట్టింది. "ఇది సర్దుబాటు కాదు... పగటిదోపిడీ! దారిదోపిడీ" అంటూ జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని, కార్పొరేట్ హాస్పిటల్ మాఫియాను కడిగేసింది.ఒక సామాన్యుడు లేదా మధ్యతరగతి పౌరుడు అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్తే చికిత్స కంటే ముందు బిల్లు చూసి హార్ట్ ఎటాక్ రావడం నేడు గ్యారెంటీగా మారింది. దీని వెనుక మెడిసిన్ చదివిన చదువుల వెనుక దాక్కున్న 'కార్పొరేట్ గ్రీడ్' స్పష్టంగా కనిపిస్తోంది. ఆసుపత్రిలో చేరిన భార్య కీమోథెరపీ కోసం ఆమె భర్త (స్వయంగా డ్రగ్ డిస్ట్రిబ్యూటర్) రూ. 11,000 ఖరీదు చేసే ఇంజెక్షన్‌ను ఆసుపత్రికి తెచ్చి తన వద్ద ఉన్నదే వాడాలని వేడుకున్నాడు. కానీ కార్పొరేట్ రూల్స్ పేరుతో దాన్ని తిరస్కరించిన యాజమాన్యం, తమ ఇన్‌హౌస్ ఫార్మసీ నుంచే దాన్ని కొనుగోలు చేయాలని నిర్బంధించి ఏకంగా రూ. 1,30,000 వసూలు చేసింది. అంటే కేవలం ఒక్క ఇంజెక్షన్‌పై ఏకంగా 1100% ప్రాఫిట్ మార్జిన్‌ను గుంజుకున్నారు. ఇక సెలైన్ ఐవీ సెట్, సిరంజీలు, కాటన్, సర్జికల్ గ్లౌజెస్, కాథెటర్స్ వంటి కన్స్యూమబుల్స్ విషయానికి వస్తే.. ఇవన్నీ హోల్‌సేల్ మార్కెట్‌లో కేవలం రూ. 10 నుంచి రూ. 15లకే లభిస్తాయి. కానీ కార్పొరేట్ ఆసుపత్రులు బాధితుడి పేషెంట్ ఫైల్‌లో వీటికి రూ. 200 నుంచి రూ. 350 వరకు బిల్లు వేస్తూ దోచుకుంటున్నాయి. తయారీ సంస్థ ఒక మందు లేదా సర్జికల్ ఐటమ్‌ను తయారు చేయడానికి అయ్యే ఖర్చు కేవలం రూ. 8 అయితే, దానికి ప్రింట్ చేసే ఎంఆర్‌పీ మాత్రం రూ. 100 లేదా రూ. 200 ఉంటుంది. హాస్పిటల్స్ ఈ ఎంఆర్‌పీ పక్కన బ్రాండ్ పేరు చూపిస్తూ, పేషెంట్ల నుంచి వందల రెట్లు ఎక్కువ డబ్బు గుంజుతున్నాయి.ఈ కేసు విచారణ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి "మేము ధరల విధానాన్ని నిరంతరం సర్దుబాటు చేస్తూనే ఉన్నాం" అని వాదించగా, ధర్మాసనం హై-వోల్టేజ్ ఆక్రోశాన్ని వ్యక్తపరిచింది. "మీ సర్దుబాటు పూర్తిగా దారి తప్పింది! రూ. 11 వేల నుంచి రూ. 1.30 లక్షలు కావడాన్ని సర్దుబాటు అనరు... దోపిడీ అంటారు! మనుషుల ప్రాణాలతో ఆడుకునేటప్పుడు ఇంత పెట్టుబడిదారీ ఆలోచన ఉండాలా? నిస్సహాయ స్థితిలో ఉన్న రోగులకు ఆసుపత్రుల దగ్గర బేరమాడే శక్త్యాయుధాలు ఉండవని మరచిపోవద్దు" అని మండిపడింది. ప్రభుత్వ డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ కింద అత్యవసర మందుల జాబితా ఉన్నప్పటికీ, మార్కెట్లోని 90 శాతానికి పైగా నాన్-షెడ్యూల్డ్ మందులు, లైఫ్ సేవింగ్ క్యాన్సర్ డ్రగ్స్, మెడికల్ డివైజెస్ ఈ కంట్రోల్ పరిధికి పూర్తిగా బయటే ఉన్నాయి. ప్రభుత్వం ఇటీవల క్యాన్సర్ మందులపై ట్రేడ్ మార్జిన్‌ను 30 శాతానికి క్యాప్ చేసినట్లు చెబుతున్నా, అసలు నోటిఫై చేయని రూట్లలో ఎంఆర్‌పీలను ఇష్టారాజ్యంగా ప్రింట్ చేసుకునే సడలింపులను కంపెనీలు వాడుకుంటున్నాయి. మూడు పార్లమెంటరీ కమిటీలు నివేదికలిచ్చినా.. తెర వెనుక ఉన్న కార్పొరేట్ సూత్రధారులకు ఆ రిపోర్టులు నచ్చడం లేదు కాబట్టే ప్రభుత్వం మౌనంగా ఉండిపోతోందని ధర్మాసనం ఘాటుగా విమర్శించింది.వివిధ నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ థింక్-ట్యాంక్స్, సర్వేల ప్రకారం భారతదేశంలో హెల్త్‌కేర్ దారిదోపిడీ ఏ స్థాయిలో ఉందో గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి..ప్రైవేట్ ఆసుపత్రుల అసోసియేషన్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రులపై తీవ్ర ఒత్తిడి ఉంది కాబట్టే ప్రైవేట్ రంగం రాత్రింబవళ్లు సేవలు అందిస్తోందని, 24 గంటలూ సదుపాయాలు సిద్ధంగా ఉంచేందుకు కోట్ల రూపాయల నిర్వహణ ఖర్చు అవుతుందని చెప్పారు. మందుల మార్జిన్లు తగ్గించేస్తే ప్రైవేట్ ఆసుపత్రులు కుప్పకూలిపోతాయని, మార్కెట్లో సగం నకిలీ మందులు ఉన్నందున రోగులు బయటి నుంచి తెచ్చే మందులను తాము నమ్మలేమని వాదించారు. దీనిని సుప్రీంకోర్టు తీవ్రంగా తిప్పికొట్టింది. మీది కార్పొరేట్ హాస్పటల్... పడక రెంట్, డాక్టర్ ఫీజు, వెంటిలేటర్, ల్యాబ్ టెస్ట్‌లు... ప్రతిదానికీ వేర్వేరుగా ఛార్జీలు లాగుతున్నారు కదా... అలాంటప్పుడు మందులను 100%, 200%, 1000% రెట్లు ఎక్కువకు ఎందుకు అమ్మాలి? ప్రైవేట్ ఆసుపత్రి నడుపుతున్నామన్న కారణంతో ఈ ఎంఆర్‌పీని సమర్థించుకోలేరు. నిలదొక్కుకోవడానికి వేరే మార్గాలు చూసుకోండి కానీ, ప్రాణాలు కాపాడాల్సిన మందులపై ఈ దోపిడీ వద్దు... తయారీ సంస్థలు ఇచ్చే కార్పొరేట్ కట్-బాక్స్ డిస్కౌంట్ల గుట్టు ఇంకా బయటకు రాలేదు... అని తేల్చిచెప్పింది. ఆవిష్కరణల పేరుతో కంపెనీలు అధిక ధరలను సమర్థించుకోవడాన్ని తప్పుబడుతూ, గత 30 సంవత్సరాల్లో భారత ఫార్మా పరిశ్రమ సొంతంగా అభివృద్ధి చేసిన ఐదు కొత్త మాలిక్యూల్స్ పేర్లు చెప్పాలని ధర్మాసనం సవాల్ విసిరింది. అంటే విదేశీ పేటెంట్లను రీ-ప్యాకేజింగ్ చేసి, లాభాలు పిండుకోవడం తప్ప మన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ శూన్యమని బట్టబయలు చేసింది.. ప్రధానమంత్రి జన్ ఔషధి కేంద్రాలు ఉన్నప్పటికీ, పెద్ద పెద్ద కార్పొరేట్ డాక్టర్లు జనరిక్ మందులు రాయకుండా, బ్రాండెడ్ ఫార్మా కంపెనీల స్పాన్సర్డ్ ట్రిప్స్ కోసం బ్రాండెడ్ మందులనే రాస్తూ పేషెంట్ల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.న్యాయవాది కిషన్ చంద్ జైన్ దాఖలు చేసిన ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ పూర్తి చేసిన సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. నాన్-షెడ్యూల్డ్ మందులు, సర్జికల్ ఐటమ్స్, కన్స్యూమబుల్స్ ఉత్పత్తుల తయారీ ధరకు, రీటైల్ అమ్మకపు ధరకు మధ్య గరిష్టంగా 30% నుంచి 50% కంటే ఎక్కువ మార్జిన్ ఉండకుండా కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధ నిబంధన తీసుకురావాలి. పేషెంట్లు క్వాలిటీ చెక్ కలిగిన సర్టిఫైడ్ బయటి ఫార్మసీల నుంచి మందులు తెచ్చుకునే వెసులుబాటును ప్రైవేట్ ఆసుపత్రులు నిరోధించకుండా కఠిన చట్టాలు చేయాలి. వైద్యులు తమ ప్రిస్క్రిప్షన్లలో కేవలం కెమికల్ మాలిక్యూల్ నామం మాత్రమే రాయాలి తప్ప, ఫార్మా కంపెనీల బ్రాండ్ పేర్లు రాయకూడదనే నిబంధనను కఠినంగా అమలు చేయాలి. వైద్యం అనేది లాభాలు పిండుకునే బిజినెస్ మోడల్ కాదు... అది రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కు! ప్రాణాలను కాపాడాల్సిన ఆసుపత్రులే జేబులు గుల్ల చేసే కసాయి కొట్టులుగా మారితే, ఆ సమాజం వినాశనానికి దారితీస్తుంది. సుప్రీంకోర్టు ఇవ్వబోయే చారిత్రాత్మక తీర్పు భారతీయ హెల్త్‌కేర్ దోపిడీకి చెక్ పెడుతుందో లేదో వేచి చూడాలి!

గోదావరి పుష్కరాలకు ముందే.. భద్రాద్రి దేవస్థాన అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా.. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బాసర నుంచి భద్రాద్రి వరకు టెంపుల్ రూట్ కావాలనే లక్ష్యంతో..భద్రాచల దేవస్థానాన్ని మహాద్భుతంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గత శ్రీరామ నవమి రోజున రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఇప్పటికే తాను మూడుసార్లు ఆలయాన్ని సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించానని, ప్రస్తుతం వేగంగా కొనసాగుతూ స్లాబులు పూర్తయ్యాయని, నవంబర్ మొదటివారం తర్వాత రాతి నిర్మాణ పనులు చేపడతామని అన్నారు.

భద్రాచలం పట్టణంలో వరద ముప్పు లేకుండా చూస్తాం

ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతివారం జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్ అండ్ బి, దేవాదాయ శాఖ అధికారులు సమీక్ష నిర్వహిస్తూ మంచి పురోగతి సాధిస్తున్నారని అధికారులను మంత్రి అభినందించారు. వర్షాకాలంలో.. గోదావరి ఉధృతి సమయంలో భద్రాచలం పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు లేకుండా చూడాలని భద్రాచలం ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారని.. దీంతో యుద్ధప్రాతిపదికన ప్రణాళికలు సిద్ధం చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. అలాగే.. ఈసారి గోదావరి పుష్కరాలకు లక్షల్లో భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఇందుకు తగ్గట్టుగా ఘాట్లను సిద్ధం చేస్తామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చర్యలు చేపడుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోపాలరావు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కండి

మొదటి పేజీ తరువాయి

నిజాం పాలనలో హైదరాబాద్‌లో అనేక చారిత్రక కట్టడాలు, అంతర్జాతీయ స్థాయి మ్యూజియాలు, టంకశాల, విమానాశ్రయం, రైల్వే వ్యవస్థ, విద్యాసంస్థలు ఏర్పాటయ్యాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్న సత్య నాదెళ్ల (మైక్రోసాఫ్ట్), అజయ్ బంగా (ప్రపంచ బ్యాంకు), శంతను నారాయణ్ (అడోబ్), ప్రేమ్ వత్స వంటి వారు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు అంతర్జాతీయ స్థాయి ప్రతిభావంతులనుఅందించడంలో హైదరాబాద్‌కుప్రత్యేకగుర్తింపుసీఎం తెలిపారు.

రాజీవ్, పీవీ సేవలు మరువలేనివి

భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు సిద్ధమవుతున్న తరుణం లో దేశాభివృద్ధికి బాటలు వేసిన నాయకులను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యువ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ కంప్యూటర్, టెలికం రంగాల్లో తీసుకొచ్చిన మార్పులు దేశ ప్రగతికి పునాది వేసిందని సీఎం కొనియాడారు. నేడు ఫోన్, ఇంటర్నెట్ లేని జీవితం ఊహించలేని పరిస్థితి ఏర్పడిందంటే అందుకు ఆనాటి సంస్కరణలే కారణమన్నారు. రాజీవ్‌గాంధీ హైదరాబాద్‌లో పైలట్ శిక్షణ పొందారని, అందుకే హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టామని సీఎం తెలిపారు.

1991లో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన పీవీ నరసింహారావు దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో కీలక సంస్కరణలు తీసుకొచ్చారని సీఎం తెలిపారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ చూపారని వివరించారు. హైదరాబాద్ జీవన విధానంలోనే ప్రపంచ దృక్పథం ఉందని, సంస్కరణలు, పారిశ్రామిక అభివృద్ధి, వ్యాపార స్ఫూర్తి తెలంగాణ ప్రజల జీవన విధానంలో భాగమని రేవంత్‌రెడ్డి అన్నారు. 1991నుంచివివిధ రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పటికీ, హైదరా బాద్ లో పెట్టుబడులకుఅన్నిప్రభుత్వాలు తమవంతు సహకారంఅందించాయని తెలిపారు.

పెట్టుబడులు రెట్టింపు చేయండి...

మీ ఎదుట సుదీర్ఘ ప్రసంగం చేయడానికి తాను రాలేదని, మీ అభిప్రాయాలు తెలుసుకోవడానికి వచ్చానని అంతర్జాయతీ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. వ్యాపార, వాణిజ్య రంగంలో పారిశ్రామికవేత్తలకు తమకంటే ఎక్కువ అనుభవం ఉందని, వారి నుంచి నేర్చుకుని, సూచనలను అర్థం చేసుకుని అమలు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించుకున్న పారిశ్రామికవేత్తలు తమ పెట్టుబడి మొత్తాన్ని, వ్యాపార వృద్ధిని, లాభాల అంచనాలను రెట్టింపు చేయాలని కోరారు. పారిశ్రామికవేత్తలు తమ లక్ష్యాలను చేరుకోవడానికి ప్రభుత్వం నుంచి ఏం కావాలో చెప్పాలని, విధానపరమైన మార్పుల నుంచి అవసరమైన సహకారం వరకు అన్నింటినీ అందించేందుకు వ్యక్తిగతంగా తాను బాధ్యత తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల తెలంగాణ

'తెలంగాణ రైజింగ్--2047' లక్ష్యం వికసిత్ భారత్-2047 దార్శనికతకు అనుగుణంగా ఉంటుం దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగే సమయంలో దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 5 శాతం నుంచి 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం వివరించారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సీఎం ప్రకటించారు.

కేంద్రంతో కలిసి రాష్ట్రాభివృద్ధి

కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై పెట్టుబడిదారులకు సందేహాలు ఉండొచ్చని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

అయితే, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా హాజరుకావడమే ఇందుకు నిదర్శనమని సీఎం తెలిపారు. దేశంలో ఏడు హైస్పీడ్ రైలు కారిడార్ల ఏర్పాటుకు కేంద్రం నిర్ణయించగా, వాటిలో హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, పుణెకు మూడు కారిడార్లు కేటాయించారని తెలిపారు. వరంగల్, ఆదిలాబాద్‌లలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు కూడా కేంద్రం సహకరిస్తోందన్నారు.

రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు విస్తరణ, నేవీ లో-ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్‌తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కేంద్రం నుంచి సహకారం అందుతోందని సీఎం తెలిపారు. దేశాభివృద్ధి, ప్రజాసేవ విషయంలో రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

అభివృద్ధి విషయంలో ప్రభుత్వ అతి జోక్యానికి బదులు సమర్థ పాలన అవసరమని అభిప్రాయపడ్డారు. పారిశ్రామికవేత్తలు విజయాలు సాధించే మార్గంలో ఉన్న అడ్డంకులను తొలగించడమే తన బాధ్యతని తెలిపారు. హైదరాబాద్ పోటీ ఢిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు నగరాలతో కాదని, న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్, దుబాయ్ వంటి ప్రపంచ నగరాలతో నేనని సీఎం అన్నారు. ప్రపంచస్థాయి ఆలోచనలు, మెరుగైన విధానపరమైన సూచనలను పారిశ్రామికవేత్తలు అందించాలని కోరారు. వారి సూచనలను ప్రభుత్వ విధానాల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తెలంగాణ ప్రగతి పథంలో ముందుకు సాగుతోందని, ఈ ప్రయాణంలో ప్రపంచ పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

అంతా కలిసి ముందుకు సాగితే చరిత్ర సృష్టించగలమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీలు అభిషేక్ మను సింఘ్వీ, రేణుకా చౌదరి, డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాంరెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

మొదటి పేజీ తరువాయి

నిధుల వినియోగంలో జాప్యం చోటుచేసుకోకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

రైతు భరోసా, సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ రైతులకు అందుతున్న ప్రయోజనాలను సమగ్రంగా నమోదు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. భూమి యాజ మాన్యం ఆధారంగా అమలవుతున్న పథకాల వల్ల సబ్‌ప్లాన్ నిధుల వినియోగంలో ఏర్పడుతున్న వ్యత్యాసాలను గుర్తించి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ఆదేశించారు.అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో ధ్రువీకరించి, పథకాల వారీగా లబ్ధిదారుల పేర్లు, గ్రామాలు, సామాజిక వర్గం, అందిన ప్రయోజనాల వివరాలతో డిజిటల్ రికార్డు రూపొందించాలని సూచించారు. ప్రతి శాఖ తన పరిధిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందించిన ప్రయోజనాలనుస్పష్టమైన గణాంకాలతో వెల్లడించాలని అన్నారు.

1,300 ఎకరాల ఖాళీ భూమిపై దృష్టి

జిల్లా కలెక్టర్ల నుంచి అందిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో సుమారు 1,300 ఎకరాల మేర ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నట్లు అధికారులు సమావేశంలో వివరించారు. ఈ భూమిని అవసరాలకు అనుగుణంగా వినియోగించే అవకాశాలను పరిశీలించాలని భట్టి విక్రమార్క సూచించారు. ఇప్పటికే గుర్తించిన స్థలాలను అర్హులైన కుటుంబాలకు అందించేందుకు అవసరమైన అనుమతులు, తదుపరి చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

గృహ స్థలాలు లేని అర్హులైన కుటుంబాలకు స్థలాలు సమకూర్చేందుకు అవసరమైన చోట భూసేకరణ ప్రతిపాదనలను పరిశీలించాలని తెలిపారు.

ఆవాసాల్లో మౌలిక సదుపాయాలు

ఎస్సీ, ఎస్టీ ఆవాసాల్లో మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. విద్యుత్ సదుపాయాలు లేని ఆవాసాలను గుర్తించి విద్యుత్ లైన్లు, వైరింగ్, స్తంభాల ఏర్పాటు తదితర పనులను చేపట్టేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అన్నారు.

ప్రతి నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సామాజిక అవసరాలను గుర్తించి కమ్యూనిటీ హాళ్లు, శ్మశానవాటికలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని భట్టి విక్రమార్క సూచించారు. స్థానిక అవసరాల ఆధారంగా ప్రాధాన్య క్రమంలో ప్రతిపాదనలు సిద్ధం చేసి, వివిధ శాఖల సమన్వయంతో పనులను చేపట్టాలని ఆదేశించారు.

గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు విస్తరించాలి

ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత విస్తరించేందుకు మొబైల్ వైద్య యూనిట్ల ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు వైద్యులు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో సకాలంలోవైద్యసేవలుఅందేవిధంగావ్యవస్థను బలోపేతం చేయాలని అన్నారు.ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం, విద్యుత్, గృహ వసతి, వైద్యం, సామాజిక మౌలిక సదుపాయాలను మెరుగు పరచడం ద్వారా లక్షిత వర్గాల జీవన ప్రమాణాలను పెంచేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకుసాగాలని ఇరువురు నేతలు అధికారులకు సూచించారు. ఈసమావేశంలోఉన్నతాధికారులునవీన్‌మిట్టల్,నందీప్‌కుమార్ సుల్తానియా, సురేంద్రమోహన్,సిక్తా పట్నాయక్, , విజయేంద్రబోయి, గోపి, గుగులోతు రవినాయక్,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

గొట్టా బ్యారేజీకి పోటెత్తిన వరద

శ్రీకాకుళంఒడిశా భారీ వర్షాలతో శ్రీకాకుళంలో గొట్టా బ్యారేజీకి వరద నీరు పోటెత్తింది. భారీ వర్షాలతో వరద ప్రవాహం పెరిగింది. దాంతో అధికారులు గొట్టా బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసారు. 19 గేట్లు ఎత్తి దిగువకు వరదనీటిని విడుదల చేసారు. బ్యారేజీలోకి 48,576 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వుండగా 48,576 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేసారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

వెంకటాపూర్‌లో రూ.99 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయిన్ల ప్రారంభం. ప్రారంభించిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మంత్రి దనసరి అనసూయ సీతక్క

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 29 వెంకటాపురంగురువారం ములుగు జిల్లా వెంకటాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్మన్ శ్రీనివాస్‌తోపాటు కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం వెంకటాపూర్ మండల కేంద్రంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయిన్లను మంత్రి ప్రారంభించారు. సీఆర్ఆర్ ప్లెయిన్ 2025--26 నిధులతో రూ.54 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్లు, సీఆర్ఆర్ ఎస్‌సీపీ 2024--25 నిధులతో రూ.45 లక్షల అంచనా వ్యయంతో సీసీ డ్రెయిన్ల పనులు చేపట్టారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గతంలో కాలనీలో పర్యటించినప్పుడు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులను మంజూరు చేసినట్లు తెలిపారు. స్థానిక సర్పంచ్, నాయకుల సూచనలు, సలహాలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ గ్రామాల అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు.

ఆశించిన మేర వర్షాలు కురవని నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, ప్రతి కుటుంబం నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని కోరారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి అన్నారు. గ్రామాల్లో రోడ్లు, మురుగునీటి కాలువలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, డిసిఒ రామ్మోహన్ ,వ్యవసాయ సహకార సంఘం పీఏసీఎస్ నూతన కమిటీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

సురక్షిత్ బచ్పన్ అభియాన్ లో విద్యార్థుల అవగాహన కార్యక్రమానికి హాజరైన

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి,మంత్రి సీతక్క

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతి నిధి అక్టోబర్ 29 గోవిందరావుపేట్ గురువారం ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గోవిందరావు పేట మండలం పసర జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో 'సురక్షిత్ బచ్‌పన్ అభియాన్'లో భాగంగా నిర్వహించిన విద్యార్థుల అవగాహన కార్యక్రమానికి మంత్రి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ జీవితంలోని ప్రతి దశలో చదువు, జ్ఞానం మనకు అండగా నిలుస్తాయని తెలిపారు. ఎలాంటి కష్టాలు ఎదురైనా విద్యావంతులు తమ జ్ఞానంతో ఉపాధి పొందుతూ స్వశక్తితో జీవించగలుగుతారని పేర్కొన్నారు. విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలని, తాము సంపాదించిన జ్ఞానాన్ని పది మందికి పంచాలని సూచించారు. ఇతరులకు జ్ఞానాన్ని అందించడంలో సంతృప్తి ఉంటుందని, ప్రతి ఒక్కరూ చదువుకు ప్రాధాన్యమివ్వాలని కోరారు.

పాఠశాలల్లో, బస్సులు, ఆటోల్లో ప్రయాణించేటప్పుడు, ఇళ్లు, పరిసరాల్లో ఎదురయ్యే వివిధ రకాల వేధింపులను గుర్తించేలా విద్యార్థులు వ్యక్తిగత భద్రతపై అవగాహన పెంచుకోవాలని మంత్రి సూచించారు. ఇలాంటి విషయాలను విద్యార్థులకు తెలియజేసేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చదువుతోపాటు తమ రక్షణకు సంబంధించిన అంశాలనూ తెలుసుకోవాలని కోరారు.కార్యక్రమంలో పోక్సో చట్టం, సైబర్ నేరాలు, బాలల అక్రమ రవాణా నివారణతోపాటు బాలల రక్షణకు సంబంధించిన ఇతర చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాట్లాడే బొమ్మ ద్వారా 'గుడ్ టచ్--బ్యాడ్ టచ్' గురించి ప్రత్యక్షంగా వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత,ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్నినో ప్రభావం దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటలు వేయాలి...

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం రూరల్ మండలం చింతపల్లిలో రైతు అవగాహన సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 29:ఎల్నినో ప్రభావం వలన వర్షభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా రైతులు అధిక నీరు అవసరమయ్యే వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పిలుపునిచ్చారు. ఖమ్మం రూరల్ మండలం చింతపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భూగర్భ జలాలు తగ్గడం, వచ్చే ఏడాది ఆగస్టు వరకు వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున కూరగాయలు, చిరుధాన్యాలు వంటి తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుని తేమతో పండే పంటలను ఎంచుకోవాలని అన్నారు. పశువుల దాణా సమస్య తలెత్తకుండా ఉచిత పశుగ్రాస విత్తనాల కిట్లను అందిస్తున్నామని అన్నారు.

వర్షభావం దృష్ట్యా ఉపాధి హామీ పథకం ద్వారా రోజుకు రూ. 308 ల కూలీతో ఎక్కువ పనిదినాలు కల్పిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను, రైతులను వేధిస్తున్న కోతుల బెడదపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, తగిన నివారణ చర్యలు చేపడతామని కలెక్టర్ అన్నారు. ప్రాంతీయంగా వలస వస్తున్న నైజీరియా కొంగలు సంరక్షణ కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను చేస్తామన్నారు.

అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికీ మొదటి, రెండో విడతలు మంజూరయ్యాయని, మూడో, నాలుగో, ఐదో విడతలు మంజూరు అవుతాయని, ప్రతి అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు.

రాబోయే గ్రాడ్యుయేట్ ఎంబిసి ఎన్నికల దృష్ట్యా, అక్టోబర్ 31, 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులు ఫారమ్-18 ద్వారా వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటరుగా నమోదు కు నవంబర్ 6 వరకు మాత్రమే గడువు ఉందని తెలిపారు. ఓటరు లిస్టులో నమోదు చేసుకున్న, గ్రాడ్యుయేట్ ఎన్నికలకు దరఖాస్తు తప్పనిసరి అని తెలిపారు. సంబంధిత తహసీల్దార్ కార్యాలయం, బూత్ స్థాయి అధికారిని సంప్రదించాలని, ఆన్లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ అన్నారు.

కార్యక్రమంలో రైతులడిగిన ప్రశ్నలకు కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు. వ్యవసాయ, ఉద్యానవన, ఇరిగేషన్ శాఖల అధికారులు రైతులకు ఎల్నినో ప్రభావం గురించి అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి ఎం.వి. మధుసూదన్, ఇరిగేషన్ డిఈ రాజేష్, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ వినయేందర్ రెడ్డి, ఎంపీడీవో రవికుమార్, వ్యవసాయ అధికారి సురేష్, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యం సాధ్యమే
తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సంపూర్ణ సహకారం

మొదటి పేజీ తరువాయి

ఇందుకు తెలంగాణ చరిత్రలోని కాకతీయుల కాలం నాటి ఉదాహరణను ప్రస్తావించారు. క్రీ.శ. 1244లో కాకతీయ పాలకుడు గణపతిదేవుడు మోటుపల్లి ఓడరేవులో జారీ చేసిన అభయ శాసనం సముద్ర వాణిజ్యంలో కీలక సంస్కరణలకు నాంది పలికిందన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యాన్ని స్వాగతిస్తున్నట్లు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.

తెలంగాణ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లు తెలంగాణ నుంచి ఎగుమతులు పెంచేందుకు రాష్ట్రం ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సూచించారు. రాష్ట్రంలోని అత్యధిక ఎగుమతి సామర్థ్యం ఉన్న 50 ఉత్పత్తులు, సేవలను గుర్తించాలన్నారు. తెలంగాణలోని జీఐ గుర్తింపు పొందిన ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మరింత గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ఇందుకు నాణ్యమైన ప్యాకేజింగ్, బ్రాండింగ్, ఉత్పత్తుల మూలాలను గుర్తించే ట్రేసబిలిటీ వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు.

తాండూరు కందిపప్పు, చపాటా మిర్చి, నిజామాబాద్ పసుపు వంటి ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో మంచి అవకాశాలున్నాయని కేంద్ర మంత్రి గుర్తు చేశారు. వాటికి అంతర్జాతీయంగా మెరుగైన ధర లభించేలా చర్యలు తీసుకుంటే రైతుల ఆదాయం పెరుగుతుందని చెప్పారు.ఇటీవల తాండూరు ఎర్ర కందిపప్పు ఉత్పత్తులను హైదరాబాద్ నుంచి ఆస్ట్రేలియాకు ఎగుమతి చేయడం తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు ఉన్న అవకాశాలకు నిదర్శనమని కేంద్ర మంత్రి అన్నారు.

ఫార్మా రంగంలో ఆవిష్కరణలకు ప్రాధాన్యం తెలంగాణ ఫార్మా రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని గోయల్ సూచించారు. జనరిక్ ఔషధాల తయారీకి మాత్రమే పరిమితం కాకుండా, అధిక విలువ కలిగిన బ్రాండెడ్ ఔషధాలు, వినూత్న ఔషధాలు, బయోసిమిలర్ల తయారీపై దృష్టి పెట్టాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని అంతరిక్షం, విమానయాన రంగాలు, విమాన విడిభాగాల తయారీ, నిర్వహణ-మరమ్మతు సేవలు (ఎంఆర్ఓ), రక్షణ పరికరాలు, ఎలక్ట్రానిక్స్, కృత్రిమ మేధ, క్వాంటం కంప్యూటింగ్, మెషీన్ లెర్నింగ్ రంగాల్లో తెలంగాన పెట్టుబడులను ప్రోత్సహించాలని చెప్పారు.

తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ, వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధిని ఆయన ప్రస్తావించారు. కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తేనే వివిధ పరిశ్రమల్లో ప్రపంచ స్థాయి నాయకత్వం సాధ్యమవుతుందని చెప్పారు. దీపావళి పండుగ సమయంలో ఒక్కో దీపం వెలిగించడం ద్వారా వెలుగులు విస్తరించినట్లే.. ఒక్కో పెట్టుబడి, ఒక్కో ఎగుమతి, ఒక్కో కొత్త ఉద్యోగం, ఒక్కో స్టార్టప్ దేశాభివృద్ధికి దోహదపడతాయన్నారు. భారత్, తెలంగాణ భవిష్యత్తు ఉమ్మడి కృషిపైనే ఆధారపడి ఉందన్నారు. దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు తెలంగాణలోని అవకాశాలను పరిశీలించి, దీర్ఘకాలిక భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకోవాలని ఆహ్వానించారు. ఈ పెట్టుబడుల ద్వారా ఉద్యోగాల సృష్టి, ప్రజల సంపద పెరుగుదల, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతాయని చెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

ఉస్మానియా జనరల్ హాస్పిటల్ నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

మంత్రి దామోదర్ రాజనర్సింహ

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఈ రెండు ప్రాజెక్టులు కీలక పాత్ర పోషించనున్నాయని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, నిర్ణీత ప్రణాళిక ప్రకారం పనులు ముందుకు సాగేలా చూడాలని మంత్రి అధికారులకు సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయంతో వ్యవహరిస్తూ, నిర్మాణ సమయంలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం వైద్యరంగ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందని, కీలకమైన ఈ ప్రాజెక్టుల నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ వాణి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టులో మరో కీలక మైలురాయి..

90.1 శాతం ఫిజికల్ ప్రోగ్రెస్

ఏలూరు, అక్టోబరు 29 ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం శరవేగంగా సాగుతుంది. తాజాగా పోలవరం ప్రాజెక్టు మరో ప్రధాన మైలురాయిని చేరుకుంది. సెప్టెంబర్ నాటికి ఈ ప్రాజెక్టు మొత్తం నిర్మాణంలో 90.1 శాతం ఫిజికల్ ప్రోగ్రెస్ సాధించగా, మొదటి విడత కింద 78 శాతం పనులు పూర్తైనట్లు అధికారులు తెలిపారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నీటి వనరుల శాఖ కార్యదర్శి అధ్యక్షతన అక్టోబర్ 12న జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో సమర్పించిన నివేదిక ప్రకారం ప్రాజెక్టుకు సంబంధించిన హెడ్‌వర్క్స్, ప్రధాన కాలువల పనులు తుది దశకు చేరుకున్నాయి. స్పిల్‌వే, గ్యాప్-3లో మెయిన్ డ్యామ్, గ్యాప్-1, 2లలో డయాఫ్రమ్ వాల్స్, అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్ కాఫర్ డ్యామ్‌లు, అప్‌స్ట్రీమ్ కాఫర్ డ్యామ్ బట్రెస్, కుడి కాలువ పనులు వంద శాతం పూర్తయ్యాయి. సివిల్ పనుల్లో 88 శాతం ఆర్థిక పురోగతి, భూసేకరణలో 95.6 శాతం పూర్తైందని నివేదిక తెలిపింది. అయితే, నిర్వాసితుల పునరావాసం, పునర్నిర్మాణం పనులు ప్రస్తుతం 51.9 శాతం వద్ద ఉండటంతో, ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి అధికారులు దీనిపై దృష్టి సారించారు. ఆగస్టు 28, 2024న కేంద్ర క్యాబినెట్ ఫేజ్-1 వ్యయం రూ. 30,436.95 కోట్లకు సవరించి ఆమోదం తెలిపింది. అనంతరం కేంద్ర ప్రభుత్వం నుండి ప్రాజెక్టుకు నిరంతరంగా ఆర్థిక సహాయం అందుతోంది. ఏప్రిల్ 1, 2014 నుండి ఇప్పటివరకు కేంద్రం రూ. 23,485.31 కోట్లను విడుదల చేసింది. ఇందులో నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసేందుకు 2024?25, 2025?26 సంవత్సరాలకు గానూ రూ. 7,862.93 కోట్ల ముందస్తు గ్రాంట్ మంజూరు చేసింది. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశాయి. డిసెంబర్ 2026 నాటికి ప్రాజెక్టు ప్రాథమిక కనెక్టివిటీ పనులన్నీ పూర్తి చేయనున్నారు. మార్చి 2027 నాటికి గ్యాప్-1లోని ఎర్త్-కమ్-రాక్-ఫిల్ డ్యామ్ ఎంబ్యాంక్‌మెంట్ పనులు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. జూన్ 2027 నాటికి గ్యాప్-2 ఎంబ్యాంక్‌మెంట్ పనులతో పాటు స్కాడా కంట్రోల్ బిల్డింగ్, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్లు, యాక్సెస్ రోడ్లు, స్లోప్ ప్రొటెక్షన్ పనులు పూర్తి చేసి ప్రాజెక్టును రెడీ చేయనున్నారు.

నాదెండ్ల మనోహర్ వైపే గురి

గుంటూరు, అక్టోబరు 29 ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో , ముఖ్యంగా డిజిటల్ స్పేస్‌లో ప్రస్తుతం తీవ్రమైన చర్చకు దారితీస్తున్న అంశం జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ లక్ష్యంగా సాగుతున్న సోషల్ మీడియా దాడులు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొంతమంది జనసేన సానుభూతిపరులు, అభిమానులు , శ్రేణులు అని చెప్పుకునే నెటిజన్లు నేరుగా నాదెండ్ల మనోహర్‌ను టార్గెట్ చేస్తూ.. ఆయన పార్టీ బాధ్యతల నుంచి తప్పుకోవాలని, లేదా ఆయనను పక్కన పెట్టాలని పోస్టులు పెట్టడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. గతంలో అనేక సందర్భాల్లో జనసేనాని పవన్ కళ్యాణ్ స్పందిస్తూ నాదెండ్ల మనోహర్‌ను ఏమైనా అంటే నన్ను అన్నట్లే, పార్టీ కష్టకాలంలో నిలబడిన శ్రేయోభిలాషి ఆయన అని బహిరంగ వేదికలపై స్పష్టమైన హామీ ఇచ్చినా కూడా.. ఈ ప్రచారం తగ్గకపోవడం వెనుక పెద్ద పొలిటికల్ స్కిట్ నడుస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.నిజానికి, 2019 ఘోర పరాజయం తర్వాత జనసేన ఉనికిని కాపాడుకోవడంలో, క్షేత్రస్థాయిలో పార్టీకి ఒక బలమైన ఆర్గనైజేషనల్ స్ట్రక్చర్ తీసుకురావడంలో నాదెండ్ల మనోహర్ పాత్రను ఎవరూ కాదనలేరు. మాజీ స్పీకర్‌గా ఆయనకున్న రాజకీయ అనుభవం, లీగల్ , అడ్మినిస్ట్రేటివ్ పరిజ్ఞానం పవన్ కళ్యాణ్‌కు ఎంతో ఉపకరించాయి. పార్టీ నాయకులు కార్యకర్తలను సమన్వయం చేయడం, పొత్తుల చర్చల సమయంలో టీడీపీ-బీజేపీ అగ్రనేతలతో సంప్రదింపులు జరపడం వంటి క్లిష్టమైన బాధ్యతలను నాదెండ్ల ఎంతో సైలెంట్‌గా నిర్వర్తించారు. అలాంటి వ్యూహకర్తను ఇప్పుడు ఉన్నపలంగా సొంత పార్టీకి చెందిన నెటిజన్లే నిందించడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనేది ప్రధాన ప్రశ్నగా మారింది.ఈ టార్గెటింగ్ వెనుక మొదటి ప్రధాన కారణం.. సీట్ల కేటాయింపులు , స్థానిక సంస్థల టికెట్ల అసంతృప్తి . కూటమి ప్రభుత్వంలో జనసేన 21 అసెంబ్లీ స్థానాల్లో 100% స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించినప్పటికీ, స్థానిక ఎన్నికల్లో పొత్తుల కారణంగా అనేకమంది క్షేత్రస్థాయి నేతలకు, పోటీ చేయాలనుకున్న ఆశావహులకు సీట్లు దక్కలేదు. మున్సిపల్, పంచాయతీ, పరిషత్ ఎన్నికలలో కూడా సీట్ల కేటాయింపుల బాధ్యత నాదెండ్ల మనోహర్ నేతృత్వంలోని పిఏసి సమీక్షిస్తుండటంతో.. అవకాశాలు రాని ఆశావహులు తమ కోపాన్ని పవన్ కళ్యాణ్‌పై చూపించలేక, ఆయనకు కుడి భుజంగా ఉన్న నాదెండ్లపైకి మళ్లిస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. పవన్ కళ్యాణ్‌ను కలవడానికి లేదా ఆయన వరకు తమ ప్రతిపాదనలు తీసుకెళ్లడానికి నాదెండ్ల మనోహర్ ఒక పెద్ద అడ్డంకిగా మారారని, ఆయన అనుమతి లేనిదే అధినేతను కలిసే అవకాశం దక్కడం లేదని ద్వితీయ శ్రేణి నేతలలో కొంత అసహనం ఉంది. రాజకీయాల్లో పార్టీ అధినేత చుట్టూ ఉండే రక్షణ కవచం వంటి నేతలే ఎప్పుడూ క్యాడర్ ఆగ్రహానికి మొదటి బాధితులవుతుంటారు. ఈ క్రమంలోనే పవన్ కంటే ముందు నాదెండ్ల విమర్శల దాడికి గురవుతున్నారు.విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రత్యర్థులు జనసేనను సంస్థాగతంగా బలహీనపరచడానికి డివైడ్ అండ్ రూల్ వ్యూహాన్ని అమలు చేస్తున్నాయనే కోణాన్ని తోసిపుచ్చలేం. నాదెండ్ల మనోహర్‌ను సామాజిక వర్గపరంగా, అలాగే రైట్ హ్యాండ్ స్థానం నుంచి వేరు చేయగలిగితే.. పవన్ కళ్యాణ్ చుట్టూ ఉన్న పరిపాలనా వ్యవస్థ, సమన్వయం దెబ్బతింటుందనేది ప్రత్యర్థుల ఆలోచన అయి ఉండవచ్చు.

సోషల్ మీడియాలో డమ్మీ ప్రొఫైల్స్ ద్వారా జనసేన కార్యకర్తల పేరిట నాదెండ్లపై నెగెటివ్ ప్రచారం చేయించడం ఈ మైండ్ గేమ్‌లో భాగమని భావిస్తున్నారు. అసలు నాదెండ్ల మనోహర్‌ను పార్టీకి దూరం చేస్తే లేదా ప్రాధాన్యత తగ్గిస్తే ఎవరికి లాభం.. ప్రథమంగా, ఇది జనసేనకు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుంది. పవన్ కళ్యాణ్ పూర్తిస్థాయి డిప్యూటీ సీఎంగా నిరంతరం బిజీగా ఉండే సమయంలో పార్టీ రోజువారీ వ్యవహారాలు చూసే అనుభవజ్ఞుడైన అడ్మినిస్ట్రేటివ్ ఫేస్ కరువవుతుంది. రెండవది, కూటమి భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, బీజేపీలతో సత్సంబంధాలు నెరపే సమన్వయకర్త తగ్గిపోతారు. ప్రత్యర్థులకు ఇది చాలా పెద్ద విజయం కాగా, జనసేనలోని కొన్ని అసంతృప్తి వర్గాలకు తాత్కాలిక సంతోషాన్ని ఇవ్వవచ్చు. సోషల్ మీడియా ట్రోలింగ్స్ , అసంతృప్తులు రాజకీయాల్లో సహజమే అయినప్పటికీ, నాదెండ్ల మనోహర్ లాంటి సీనియర్ నాయకుడి విషయంలో క్రమశిక్షణ తప్పడం పార్టీకి నష్టం కలిగిస్తుంది. పవన్ కళ్యాణ్ స్వయంగా రంగంలోకి దిగి తన స్పష్టమైన సందేశాన్ని మళ్లీ శ్రేణులకు అందిస్తే తప్ప, నాదెండ్లపై సాగుతున్న ఈ డిజిటల్ ప్రచారానికి తెరపడకపోవచ్చు

కొట్టుకుపోయిన కొబ్బరికాయలు

అమలాపురం, అక్టోబరు 29 పచ్చని ప్రకృతికి చిరునామా.. కొబ్బరి తోటల సుందర సీమ అయిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ నేడు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నాబ్' అతి తీవ్ర తుపాను యానాం-నర్సాపురం మధ్య తీరం దాటిన వేళ కోస్తాంధ్రపై విశ్వరూపం చూపింది. అర్ధరాత్రి వేళ 100 కిలోమీటర్లకు పైగా వేగంతో వీచిన పెనుగాలులు.. పగటి చుక్కలు చూపించిన వర్షం కోనసీమ రూపురేఖలనే మార్చేశాయి. తరతరాలుగా కంటికి రెప్పలా కాపాడుకుంటూ.. బిడ్డల కంటే ప్రాణప్రదంగా పెంచుకున్న కొబ్బరి చెట్లు ఒక్క రాత్రిలోనే నేలకొరిగాయి. అమలాపురం, ముమ్మిడివరం, కాట్రేనికోన, పోలవరం, అంబాజీపేట, పి.గన్నవరం, రావులపాలెం, అయినవిల్లి తదితర ప్రాంతాల్లో ఎటు చూసినా విరిగిపడిన కొమ్మలు, వేళ్లతో సహా కూలిపోయిన కొబ్బరి చెట్లే కనిపిస్తున్నాయి. కొబ్బరితో పాటు అరటి, బొప్పాయి తోటలు కూడా పూర్తిగా దెబ్బతినడంతో వేలాది మంది రైతుల కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరైంది. "మా జీవనాధారం నేలమట్టమైంది.. ఇక మేము ఎలా బ్రతకాలి?" అంటూ రైతన్నలు గుండెలవిసేలా రోదిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుండటంతో ప్రతి ఒక్కరి హృదయాలు ద్రవించిపోతున్నాయి. ఈ ప్రకృతి ప్రకోపానికి నిదర్శనంగా అయినవిల్లి మండలం ఎస్.మూలపొలంలో వందల ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన రావి చెట్టు కూడా విరిగి పడిపోయింది. ఊళ్లకు ఊళ్లే విద్యుత్ స్తంభాలు కూలిపోయి అంధకారంలో చిక్కుకున్నాయి. రావులపాలెం-అమలాపురం మార్గంలో భారీ వృక్షాలు రహదారులకు అడ్డంగా పడటంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయి ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. తుపాను తీరం దాటినప్పటికీ కోస్తాంధ్రలో భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. విద్యుత్ శాఖ, సహాయక బృందాలు రహదారులను పునరుద్ధరించే పనిలో నిమగ్నమయ్యాయి. అయితే ఒక్క రాత్రిలో సర్వస్వం కోల్పోయిన కోనసీమ రైతులకు తక్షణం సమగ్ర సర్వే జరిపి, ప్రభుత్వం ఆదుకోకపోతే వారు ఈ కోలుకోలేని దెబ్బ నుంచి బయటపడటం అసాధ్యం.

అర్నాబ్ తుపాను తీరం దాటినప్పటికీ దాని ప్రభావంతో కోస్తాంధ్రలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తెలంగాణలోనూ కొన్ని ప్రాంతాల్లో వర్షాలు నమోదవుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. విద్యుత్ తీగలు తెగిపడిన ప్రాంతాలకు దూరంగా ఉండాలని.. చెట్లు లేదా బలహీనమైన నిర్మాణాల కింద నిలబడవద్దని హెచ్చరిస్తున్నారు. తుపాను సృష్టించిన నష్టంపై అధికార యంత్రాంగం పూర్తి స్థాయి అంచనా వేయాల్సి ఉంది. ముఖ్యంగా కొబ్బరి, అరటి పంటలను కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ప్రకృతి వైపరీత్యం కోనసీమ రైతులకు మిగిల్చిన ఈ నష్టం నుంచి వారు త్వరగా కోలుకోవాలంటే తక్షణ సహాయక చర్యలతో పాటు పంట నష్టంపై సమగ్ర సర్వే కీలకం కానుంది.

సామినేని హత్య కేసులో నలుగురు అరెస్ట్

ఖమ్మం కమిషనర్ సునీల్ దత్

పాతర్లపాడు గ్రామ మాజీ సర్పంచ్ సామినేని రామారావు హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్ట

అనుభవజ్ఞులైన పోలీస్ అధికారుల పర్యవేక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఫోరెన్సిక్ ఆధారాలతోదర్యాప్తు

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 29:ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సామినేని రామారావు. వయస్సు 72 సంవత్సరాలు, 31.10.2025 తేదీన తెల్లవారుజామున తన ఇంటి పక్కన ఉన్న కొట్టంలో హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై చింతకాని పోలీస్ స్టేషన్లో జతీ. చీశీ. 324/2025, భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 103(1) మరియు సెక్షన్ 190 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా క్లూస్ టీమ్ మరియు ఫోరెన్సిక్ సైన్స బృందం

సహాయంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితులకు సంబంధించినవిగా అనుమానిస్తున్న చెప్పులు మరియు కాలి ముద్రలు, ఎరుపు రంగు వస్త్రపు ముక్క, తెలుపు రంగుపై నల్లని గీతలు ఉన్న వస్త్రపు ముక్క, కత్తి కవర్లో పాటు ఇతర భౌతిక ఆధారాలను సేకరించారు. మృతుడి శరీరంపై ఉన్న గాయాలు, సంఘటనా స్థల పరిస్థితులు మరియు సాక్షుల వాంగ్మూలాలను కూడా పరిశీలించారు.

సాంకేతిక ఆధారాల విశ్లేషణ

నిందితులను గుర్తించేందుకు పోలీసులు విస్తృత స్థాయిలో సాంకేతిక దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా, ఫిర్యాదులో పేర్కొన్న అనుమానితులు, సాక్షులు మరియు ఫిర్యాదుదారు తెలిపిన వివరాల ఆధారంగా గుర్తించిన మొత్తం 24 మంది వ్యక్తులకు పాలిగ్రాఫ్ పరీక్షలు నిర్వహించేందుకు ఖమ్మంలోని గౌరవనీయ మూడవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును అనుమతి కోరారు, కోర్టు సమన్లు అందుకున్న వారిలో ఆరుగురు అనుమానితులు స్వచ్ఛందంగా పరీక్షలకు సమ్మతి తెలిపారు. తదనుగుణంగా, 2026 జనవరి నెలలో కర్ణాటక రాష్ట్రం, బెంగళూరులోని ఫోరెన్సిక్ ల్యాబొరేటరీలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల నివేదికలను దర్యాప్తులో సేకరించిన ఇతర ఆధారాలతో కలిపి పరిశీలించగా, కొన్ని సంబంధిత ఆధారాలు లభించాయి.

దర్యాప్తును మరింత బలోపేతం చేసేందుకు గుజరాత్ రాష్ట్రం, గాంధీనగర్ లోని నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ నిపుణుల సహాయం కోరారు. ఆరుగురు సభ్యులతో కూడిన నిపుణుల బృందం ఖమ్మంకు వచ్చి ఫోరెన్సిక్ విశ్లేషణ నిర్వహించింది. ఈ విశ్లేషణ ద్వారా లభించిన సమాచారాన్ని కేసులో అందుబాటులో ఉన్న ఇతర ఆధారాలతో కలిపి పరిశీలించారు.

నలుగురు నిందితులు

దర్యాప్తులో సేకరించిన భౌతిక మరియు సాంకేతిక ఆధారాలు, ఇతర సంబంధిత సమాచారాన్ని విశ్లేషించిన అనంతరం నలుగురు నిందితులను అరెస్ట్ చేయడం జరిగింది.

అరెస్టయిన నిందితుల వివరాలు

ఎ-1) బోదపట్ల శ్రీనివాసరావు ఏ మెంటల్ శ్రీను, తండ్రి: పుల్లయ్య (లేట్), వయస్సు: 34 సంవత్సరాలు, కులం: గౌడ్, వృత్తి: మేస్త్రీ పని, నివాసం: మాలముత్యాలమ్మ సెంటర్, తెల్దారుపల్లి గ్రామం, ఖమ్మం రూరల్ మండలం.

ఎ-2) నూకల లింగయ్య, తండ్రి: సైదులు (లేట్), వయస్సు: 43 సంవత్సరాలు, కులం: యాదవ, వృత్తి: వ్యవసాయం, నివాసం: చావడి సెంటర్, తెల్దారుపల్లి గ్రామం, ఖమ్మం రూరల్ మండలం.

ఎ-3) మల్లారపు లక్ష్మయ్య, తండ్రి: రామయ్య (లేట్), వయస్సు: 24 సంవత్సరాలు, కులం: గౌడ్, వృత్తి: పెయింటర్ పని, నివాసం: తెల్దారుపల్లి గ్రామం, ఖమ్మం రూరల్ మండలం.

ఎ-4) కార్లపూడి ఉదయ్ కుమార్ ఏ రుక్మాన్ కుమార్. తండ్రి ఆదినారాయణ, వయస్సు: 39 సంవత్సరాలు, కులం: మాల, వృత్తి: పెయింటింగ్ పని, నివాసం: తెల్దారుపల్లి గ్రామం, ఖమ్మం రూరల్ మండలం.

నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు

1. నేరానికి ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్న రెండు కత్తులు.
2. నిందితులు రెక్కీ నిర్వహించే సమయంలో ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్న నాలుగు సెల్ ఫోన్లు.

దర్యాప్తులో పాల్గొన్న అధికారులు

1. పర్యవేక్షణ మరియు దర్యాప్తు బృందం

శ్రీ ఎస్. సారంగపాణి, ఏసిపి, వైరా దర్యాప్తుపై సమగ్ర పర్యవేక్షణ అధికారి.

శ్రీ వై. వెంకట ప్రసాద్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలిస్, వైరా దర్యాప్తు అధికారి.

వీరేందర్ మరియు శ్రీ జి. నరేష్. సబ్ ఇన్స్పెక్టర్లు ఆఫ్ పోలిస్ సహాయ దర్యాప్తు అధికారులు, దర్యాప్తులో విశేష ప్రతిభ కనబరిచిన వైరా ఏసీపి ఎస్. సారంగపాణి, వైరా సీఐ వై. వెంకట ప్రసాద్ మరియు బృందంలోని ఇతర అధికారులను ఖమ్మం పోలీస్ కమిషనర్ శ్రీ సునీల్ దత్ అభినందించి, వారికి రివార్డులు అందజేశారు.

వైనాట్ పులివెందుల..

విశాఖపట్టణం, అక్టోబరు 29 రాజకీయాల్లో గెలుపు ఆశలు ఉండొచ్చు. కానీ అవి రెక్కలు విప్పుకుని మరీ ప్రజాస్వామ్య సూత్రాలను దాటి వెళ్ళిపోరాదు, అధికార దుర్వినియోగంగా మారరాదు. అంతే కాదు ప్రజల ఆకాంక్షలను దాటి భిన్నంగా ఆలోచించరాదు. ఇది రాజుల కాలం కాదు కోటలను జయించుకోవడానికి, ఇది ప్రజాస్వామ్యం. జస్ట్ అయిదేళ్ళు మాత్రమే అక్కడ అధికారం ఉంటుంది. మళ్ళీ ఎన్నికలు జరిగితే తీర్పు మారుతుంది. అయినా సరే ప్రజాస్వామ్యంలో రాచరిక పోకడలతో వై నాట్ అంటున్నారు రాజకీయ అధినేతలు. అందుకే నాడు కుప్పం జగన్ టార్గెట్ అయితే నేడు పులివెందుల చంద్రబాబు టార్గెట్ అయింది. నిజానికి రాజకీయ పార్టీలు మఠాలు కావు, మడి కట్టుకుని కూర్చోవడానికి. అవి రాజకీయ ప్రాబల్యం కోసం ప్రయత్నం చేస్తాయి, చేయాలి కూడా. అది తప్పు కానే కాదు, జగన్ కుప్పం గెలవాలనుకున్నా చంద్రబాబు పులివెందుల గెలిచి తీరాలనుకున్నా లక్ష్యాలలో విభేదించేవారు లేరు, కానీ అక్కడ పార్టీలు అమలు చేస్తున్న విధానాలనే అంతా తప్పు పడుతున్నారు. అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ప్రత్యర్థి పార్టీ క్యాడర్ ని వేధించి చివరికి గెలిచామని చెప్పుకోవడం వెనక సంతోషం కానీ సంబరం కానీ ఉండదు, అది ఆత్మ సంతృప్తి కోసం మాత్రమే. జగన్ కి కుప్పంలో 2021లో కలిగిన తాత్కాలిక ఆనందం కాస్త 2024 నాటికి పూర్తిగా కరిగిపోయింది. ఎందుకంటే చంద్రబాబు కంచుకోట కుప్పాన్ని గెలిచామని జగన్ సంతోషపడినంత సేపు లేదు, ఏపీ మొత్తాన్ని టీడీపీ కూటమి కబలించి వైసీపీని అధికారంలో నుంచి దించేయడానికి పట్టిన సమయం. మరి నాడు తప్పు అని ఘోషించిన టీడీపీ వర్గాలు ఇపుడు పులివెందుల విషయంలో ఎలా ఒప్పు అనగలవని కూడా ప్రశ్నిస్తారు, అలాగే నాడు ఒప్పు అని కుప్పం కోట మీదకు రాజకీయ దండయాత్ర చేసిన వైసీపీకి ఈ రోజు పులివెందులలో టీడీపీ దండయాత్ర తప్పు ఎలా అనిపించిందో కూడా ఆలోచించాల్సిందే.నిజానికి కుప్పం అంటే చంద్రబాబు కంచుకోట అని భావిస్తారు. ఆయన 1989 నుంచి అక్కడ నుంచే గెలుస్తూ వస్తున్నారు. అందువల్ల కుప్పంలో స్థానిక ఎన్నికల్లో టీడీపీని ఓడిస్తే బాబు కోటకు బీటలు వారాయని చెప్పవచ్చు అనుకుంది వైసీపీ. కానీ అలా జరగలేదు కదా, 2024లో మళ్ళీ చంద్రబాబు అక్కడ నుంచి గెలిచారు. అంతే కాదు రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కూడా గెలిచింది. ఇపుడు పులివెందుల మీద చంద్రబాబు టార్గెట్ చేశారు. పులివెందుల అంటే 1978 నుంచి వైఎస్సార్ కుటుంబానికి కంచుకోట, వైఎస్సార్ నుంచి జగన్ దాకా వరసగా గెలుస్తూ వస్తున్నారు. అందువల్ల ఆ కోటను కొడితే జగన్ రాజకీయంగా సరి అన్నది టీడీపీ ఫిలాసఫీ. మరి కుప్పంలో టీడీపీని ఓడిస్తే 2024లో బాబు ఓడలేదు కదా మరి ఈ థియరీ కళ్ళ ముందు ఉంచుకుని మరీ ఈ రోజున పులివెందులలో అన్నీ గెలిచేశామని టీడీపీ సంబరపడడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి అన్నది ఒక చర్చ.

బ్యాలెట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జీరో

న్యూఢిల్లీ, అక్టోబరు29, నాలుగు ప్రధాన రాష్ట్రాల్లోని శాసనమండలి ఎన్నికల ఫలితాలు వెలువడిన వేళ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకుని ట్విట్టర్ వేదికగా విసిరిన సెటైర్ వైరల్ అవుతోంది. ఈవీఎంలపై ఆరోపణలు చేస్తూ బ్యాలెట్ ఎన్నికలు కావాలంటున్న కాంగ్రెస్ కు తన ట్వీట్ తో మంట పుట్టించారు మోదీ. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక వంటి నాలుగు పెద్ద రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. పైగా ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారానే జరిగాయి.. కాంగ్రెస్ పార్టీ ఎన్ని సీట్లు గెలుచుకుందో ఊహించండి? అంటూ ప్రధాని మోదీ సంధించిన ప్రశ్న నెట్టింట వైరల్ అవుతోంది. ఏ ఎన్నికల్లో ఓడిపోయినా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పై నెపం నెట్టేసే కాంగ్రెస్ పార్టీకి.. బ్యాలెట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా దక్కకపోవడాన్ని పరోక్షంగా ఎత్తిచూపుతూ మోదీ వేసిన సెటైర్ కాంగ్రెస్‌కు సూటిగా తగులుతోంది. ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే కూటమి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించగా, కాంగ్రెస్ పార్టీ పోటీ చేసిన నాలుగు రాష్ట్రాల్లో కలిపి ఒక్కటంటే ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేక పూర్తిగా జీరో వద్దే చతికిలపడింది. సొంతంగా అధికారంలో ఉన్న కర్ణాటకలోనూ కాంగ్రెస్‌కు పరాభవం తప్పలేదు. అక్కడ బీజేపీ-జేడీఎస్ కూటమి మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంది. ఇక ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్రల్లో బీజేపీ నేతృత్వంలోని కూటమి అభ్యర్థులు స్పష్టమైన ఆధిక్యతతో విజయఢంకా మోగించారు. విద్యావంతులు, పట్టభద్రులు, ఉపాధ్యాయ వర్గాలు ఓటర్లుగా ఉన్న ఈ స్థానాల్లో కాంగ్రెస్ కనీస పోటీ కూడా ఇవ్వలేకపోవడం ఆ పార్టీ కేడర్‌ను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టింది. కాంగ్రెస్ పార్టీ , ఇండియా కూటమి పక్షాలు ఎన్నికల ఓటములను కప్పిపుచ్చుకునేందుకు ఈవీఎం ట్యాంపరింగ్ ఆరోపణలను ప్రధాన అస్త్రంగా వాడుతున్నాయి. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ఈవీఎంలను తొలగించి మళ్లీ పాత పద్ధతి అయిన బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలని రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ అగ్రనేతలు నిరంతరం ఉద్యమిస్తున్నారు. విపక్షాలు కోరుకున్నట్లుగానే బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించినా ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించారన్న నిజాన్ని ప్రధాని మోదీ తనదైన శైలిలో తేటతెల్లం చేశారు. ఓటమికి కారణం యంత్రాలు కాదని, కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలేనన్న స్పష్టమైన సంకేతాన్ని ఆయన ఈ చిన్న ట్వీట్‌తో దేశ ప్రజల ముందుంచారు. బ్యాలెట్ పేపర్లతో ఓటింగ్ జరిగినా ఖాతా తెరవలేకపోయిన కాంగ్రెస్.. ఇకపై దేనిని బూచిగా చూపిస్తుందో చెప్పాలంటూ బీజేపీ నేతలు తీవ్రస్థాయిలో ఎదురుదాడి ప్రారంభించారు. ప్రధాని మోదీ సంధించిన ఈ ఒక్క చురకతో అటు కాంగ్రెస్ నైతిక స్థైర్యం దెబ్బతినడమే కాకుండా, రాబోయే రోజుల్లో ఈవీఎంలపై రచ్చ చేసేందుకు విపక్షాలకు రాజకీయంగా నోరు మెదపలేని పరిస్థితి ఏర్పడింది.

కాంగ్రెస్ కు సున్నా...

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరిగిన శాసనమండలి సభ్యుల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి నిరాశను మిగిల్చాయి. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఖాళీ అయిన 28 ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేక బోణీ కొట్టకుండానే వెనుదిరిగింది. మరీ ముఖ్యంగా తమ సొంత పాలనలో ఉన్న కర్ణాటకలో సీటింగ్ ఎమ్మెల్సీ స్థానాన్ని సైతం కోల్పోవడం ఆ పార్టీకి మింగుడుపడని పరిణామంగా మారింది.

అధికారం చేతిలో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఓటమిని మూటగట్టుకోవడం హస్తం పార్టీ శ్రేణులను తీవ్రగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలన్నీ బ్యాలెట్ పత్రాల ద్వారానే జరుగుతాయి. సాధారణంగా ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రత్యక్షంగా సమగ్ర ప్రజాతీర్పును ప్రతిబింబించనప్పటికీ, ప్రాంతీయంగా రాజకీయ సమీకరణాలు, అధికార పంపిణీ , పార్టీ సంస్థాగత బలాబలాలను అంచనా వేయడానికి స్పష్టమైన దిశానిర్దేశం చేస్తాయి. ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పట్టభద్రులు ఓటర్లుగా ఉండే ఈ ఎన్నికల్లో 28కి ఒక్క సీటు కూడా సాధించలేకపోవడం కాంగ్రెస్ క్షేత్రస్థాయి మేనేజ్‌మెంట్ వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. మిత్రపక్షాలతో సమన్వయం లోపించడం, ప్రత్యర్థుల వ్యూహాలను తిప్పికొట్టలేకపోవడమే ఈ ఘోర పరాభవానికి ప్రధాన కారణమం. పార్టీ అగ్రనాయకత్వం జాతీయ స్థాయి రాజకీయాలు, ర్యాలీలపైనే ఎక్కువ దృష్టి పెడుతూ క్షేత్రస్థాయిలోని నెట్‌వర్క్‌ను పూర్తిగా గాలికి వదిలేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బూత్ స్థాయి నుంచి స్థానిక సంస్థల వరకు బలమైన యంత్రాంగం లేకపోవడం వల్లనే ఇటువంటి ఎన్నికల్లో కాంగ్రెస్ తేలిపోతోంది. ప్రతిపక్షాల వ్యూహాత్మక ఓటింగ్, ఆకర్షణీయమైన అభ్యర్థుల ఎంపికతో ప్రత్యర్థులు పైచేయి సాధిస్తుంటే, కాంగ్రెస్ మాత్రం అంతర్గత విభేదాలు మరియు అనాలోచిత నిర్ణయాలతో మూల్యం చెల్లించుకుంటోంది. 28 స్థానాల్లో సున్నా ఫలితం రావడం అనేది కాంగ్రెస్ పార్టీ ఏమాత్రం ఉపేక్షించలేని తీవ్రమైన హెచ్చరిక. స్థానిక స్థాయిలో అధికార సమీకరణాలు మారడం ,పార్టీ యంత్రాంగం బలహీనపడటం కాంగ్రెస్ కుగడ్డు కాలం ఇంకాపోలేదని నిరూపిస్తున్నాయి.

ఈ పరాభవం నుంచి వెంటనే పాఠాలు నేర్చుకుని, సంస్థాగత లోపాలను సరిదిద్దుకోకపోతే కాంగ్రెస్ భవిష్యత్తులో మరింత భారీ వెనుకబాటును ఎదుర్కోక తప్పదు. ఎప్పుడు చూసినా ఓటు చోరీ అంటూ వ్యవస్థలపై పోరాటం చేయడం తప్పు..ప్రజల తరపున పోరాటం చేయని కాంగ్రెస్కు ఇదిఇబ్బందికరమే.

నిరుద్యోగ యువతకు బీఎంఆర్ ఫౌండేషన్ అండ..
250 మంది ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు
ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ

వికారాబాద్ ల్లా తాండూరులో నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తోంది బీఎంఆర్ ఫౌండేషన్. పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న సుమారు 250 మంది ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. తాండూరులోని విలియం మూన్ స్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మెహ్రాతో కలిసి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగ యువత, పేద కుటుంబాలకు బీఎంఆర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను అభినందించారు. అభ్యర్థులు కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. అభ్యర్థులు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ లక్ష్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆర్థిక పరిస్థితులు భవిష్యత్తుకు అడ్డంకి కాకూడదని, పట్టుదలతో చదివి పోలీస్ ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు.

అభ్యర్థులకు మెరుగైన శిక్షణ అందించడంతో పాటు, ప్రాథమిక పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఫిజికల్ టెస్టులు, తుది పరీక్షకు కూడా శిక్షణ అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడాలనే లక్ష్యంతో బీఎంఆర్ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.

నవంబరు 13 నుంచి 16వ తేదీ వరకు నాలుగు రోజులపాటు
ఛట్ పూజోత్సవాలు

హైదరాబాద్ ఉత్తర భారతీయులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఛట్ పూజోత్సవాలకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసేందుకు జీవో విడుదల చేయడంపై జన్ సేవా సంఘ్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జన్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో నవంబరు 13 నుంచి 16వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఛట్ పూజోత్సవాలను నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు బిశ్వదీప్ సింగ్ వెల్లడించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో పూజోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నెక్లెస్ రోడ్, సంజీవయ్య పార్కుతో పాటు మొత్తం 30 ఘాట్‌లలో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబరు 13, 14 తేదీల్లో భక్తులు ఉపవాస దీక్షలు చేపడతారని, 15న సాయంత్రం సూర్యాస్తమయం సమయంలో నీటిలో నిలబడి సూర్యభగవానుడికి పూజలు చేస్తారని వివరించారు. 16న తెల్లవారుజామున 5 గంటల నుంచే సూర్యోదయ పూజలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ వేడుకలకు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. సుమారు లక్ష మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. ప్రకృతికి కృతజ్ఞతలు తెలుపుతూ సూర్యభగవానుడిని ఆరాధించడం ఛట్ పూజ ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఉత్తర భారతదేశంతో పాటు నేపాల్‌లోనూ ఈ పండుగను ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం నవంబరు 15, 16 తేదీలను రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినాలుగా ప్రకటించాలని బిశ్వదీప్ సింగ్ కోరారు.

తెలంగాణ మొత్తాన్ని కరువు రాష్ట్రంగా ప్రకటించాలి
సీపీఐ, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్ ఎల్ నినో పేరుతో కరువు విలయ తాండవం చేస్తోంది . రాజకీయంగా ఒకరిపైనన ఒకరూ బురద జల్లుకోవడం మానేసి దీని నుంచి ఎట్లా బయటపడాలో ఆలోచించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కరువు అనేది ప్రపంచ వ్యాప్తంగా సంభవించింది. కరువును కొన్ని మండలాలకే పరిమితం చేయకూడదు. తెలంగాణ మొత్తాన్ని కరువు రాష్ట్రంగా ప్రకటించాలి. బియ్యం ధర, నీళ్ల ట్యాంకర్ ధరలు ఇప్పుడే పెరిగిపోయాయి. ఎక్కడైనా అక్రమంగా నిల్వ చేస్తే సీపీఐ కరువు దాడులు చేస్తోందని హెచ్చరించారు.

పేద ప్రజలకు ప్రభుత్వం ఆధ్వర్యంలో పంపిణీ చేస్తుంది . జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసేలా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలి. కరువు పరిస్థితిని పరిశీలించేందుకు నవంబర్ 3, 4 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో పర్యటిస్తాం. బ్రెజిల్ లో కమ్యూనిస్టులు మళ్లీ గెలిచారు . ప్రపంచ దేశాల్లో కమ్యూనిస్టులు గెలుస్తున్నారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల్లో కాంగ్రెస్ తొండిగా వ్యవహరించింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని సీపీఎం, కాంగ్రెస్ పార్టీలు కోరాయి. సీపీఐ నుంచి కూడా పోటీ చేయాలనే ఆలోచన ఉంది . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ తర్వాత పోటీ చేయాలా వద్దా అనేది తెలుస్తుందని అన్నారు

విజిలెన్స్ ఆవేర్స్ వీక్ పేరిట వాక్

హైదరాబాద్ అవినీతి రహిత సమాజం ఏర్పడినప్పుడే దేశం అభివృద్ధిలో ముందుకు సాగుతుందని పవర్ గ్రీడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దోమన్ యాదవ్ అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, అవినీతి నిరోధక వారోత్సవాలను పురస్కరించుకొని విజిలెన్స్ ఆవేర్స్ వీక్ పేరిట వాక్ నిర్వహించారు. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు హైదరాబాద్ సంజీవయ్య పార్క్ నుండి జలవిహార్ వరకు గొడుగులతో వినూత్నంగా వాక్ నిర్వహించారు. సమాజాన్ని అవినీతి అనే జబ్బు పట్టిపీడిస్తుందని ... అవినీతిపై పోరాటం చేయాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. అవినీతి రహిత దేశం కోసం పాటుపడాలని నినాదాలు చేస్తూ వాక్ నిర్వహించారు.

యూపీలో టగ్ ఆఫ్ వార్...
కమలానికి డేంజర్ బెల్స్



లక్నో, అక్టోబరు 29, ఉత్తరప్రదేశ్ శాసనమండలి ద్వైవార్షిక ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. బీజేపీకి తిరుగులేని కంచుకోటలుగా భావించే పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ చొచ్చుకుపోయింది. మొత్తం 11 స్థానాలు 5 గ్రాడ్యుయేట్స్, 6 టీచర్స్ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో అధికార బీజేపీ 5 స్థానాలను గెలుచుకోగా, అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని ఎస్పీ 4 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. కేవలం ఒక్క సీటు తేడాతో అధికార పార్టీ మెజార్టీని అడ్డుకోవడమే కాకుండా, విద్యావంతులు, ఉద్యోగుల వర్గాల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో ఈ ఫలితాల ద్వారా ఎస్పీ స్పష్టమైన రాజకీయ సందేశాన్ని పంపింది. ఈ ఫలితాల్లో అత్యంత విస్మయకరమైన అంశం ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభ నియోజకవర్గమైన వారణాసి ఉపాధ్యాయ స్థానాన్ని ఎస్పీ కైవసం చేసుకోవడం. కాషాయ పార్టీకి కంచుకోట లాంటి వారణాసిలో బీజేపీ అభ్యర్థిని మట్టికరిపిస్తూ ఎస్పీ అభ్యర్థి లాల్ బిహారీ యాదవ్ సాధించిన విజయం లక్నో నుంచి ఢిల్లీ దాకా చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా మేధావులు, విద్యావంతులకు కేంద్రమైన అలహాబాద్-ఝాన్సీ గ్రాడ్యుయేట్స్ స్థానంతో పాటు ఆగ్రా డివిజన్లలో సైతం సమాజ్‌వాదీ పార్టీ విజయదుందుభి మోగించింది. సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇలాకా గోరఖ్‌పూర్, మీరట్ తదితర స్థానాల్లో బీజేపీ బయటపడినప్పటికీ.. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టభద్రుల స్థానాల్లో ఎస్పీ సాధించిన ఈ స్ట్రైక్ రేట్ కమలనాథులను ఆత్మరక్షణలోకి నెట్టింది. సాధారణంగా ఉపాధ్యాయ, పట్టభద్రుల స్థానాలంటే బీజేపీ, ఆరెస్సెస్ అనుబంధ సంఘాలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందన్న సంప్రదాయానికి ఈ ఫలితాలు గండికొట్టాయి. నిరుద్యోగ సమస్య, పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరణ డిమాండ్, కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సర్వీస్ క్రమబద్ధీకరణ వంటి క్షేత్రస్థాయి అంశాలను ఎస్పీ ఎన్నికల అస్త్రాలుగా మార్చుకోవడంలో పూర్తిస్థాయిలో సఫలీకృతమైంది. యువత, మధ్యతరగతి ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న అసంతృప్తిని ఓట్ల రూపంలో మలచుకోవడంలో అఖిలేష్ యాదవ్ నెరిపిన సైలెంట్ ఆపరేషన్ తిరుగులేని ఫలితాన్ని ఇచ్చింది. కేవలం యాదవులు, మైనార్టీల ఓటు బ్యాంకు మాత్రమే కాకుండా.. విద్యావంతులు, పట్టభద్రులు, ఉపాధ్యాయ వర్గాల్లోనూ తమకు తిరుగులేని ఆమోదం లభిస్తోందని ఈ 4 ఎమ్మెల్సీ విజయాల ద్వారా ఎస్పీ నిరూపించుకుంది. రాబోయే ఎన్నికలకు ముందు విపక్ష శ్రేణుల్లో ఈ విజయం కొత్త ఊపును తీసుకురాగా, పట్టణ-విద్యావంతుల ఓటర్లను తిరిగి ప్రసన్నం చేసుకునేందుకు సరికొత్త వ్యూహాలు రచించాల్సిన అనివార్యతలోకి అధికార బీజేపీ వెళ్లిపోయింది

మహాపాదయాత్రపై బిగ్ ప్లాన్

హైదరాబాద్ అక్టోబరు 29, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టేందుకు బిజెపి భారీ వ్యూహంతో ముందుకు వచ్చింది. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. అరాచకాన్ని అడ్డుకోండి అనే శక్తివంతమైన నినాదంతో నవంబర్ 2న ట్యాంక్‌బండ్ వేదికగా బిజెపి మహా పాదయాత్రను చేపట్టనుంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్వయంగా ఈ పాదయాత్రలో పాల్గొని తెలంగాణ రణక్షేత్రంలో బిజెపి శ్రేణులకు దిశానిర్దేశం చేయనుండటంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా హడావుడి ప్రారంభమయింది. కాంగ్రెస్ ఓట్ చోరీ డ్రామాకు అమిత్ షా కౌంటర్ ఇచ్చేందుకు ఈ పాదయాత్ర చేపట్టారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీ ఆరోపణలతో నిర్వహించనున్న ర్యాలీకి సరిగ్గా మరుసటి రోజే హైదరాబాద్ వేదికగా అమిత్ షా ఈ పాదయాత్రలో పాల్గొనడం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టడమే ఈ పాదయాత్ర ముఖ్య ఉద్దేశం. మరణించినవారు, చిరునామాలు మారినవారి వివరాల సవరణను కాంగ్రెస్ రాజకీయం చేస్తోందని, ప్రజల్లోకి నేరుగా వెళ్లి నిజాలను వివరించేందుకు కేంద్ర హోంశాఖ మంత్రి స్వయంగా రంగానికి దిగుతున్నారు. ఈ మహా పాదయాత్ర కేవలం ఓటర్ల జాబితా వివాదానికే పరిమితం కాకుండా, రాష్ట్రంలో రోజురోజుకూ దిగజారుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనా వైఫల్యాలను నిలదీసేలా బిజెపి రూపకల్పన చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 300కు పైగా మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొనడం, రాజధాని హైదరాబాద్‌లోనే రోజుకు వేలాది వాటర్ ట్యాంకర్ల కోసం ప్రజలు అల్లాడుతున్నా పట్టించుకోని రేవంత్ సర్కార్ తీరును బిజెపి ఎండగట్టనుంది. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కాంగ్రెస్ నేతలు ఢిల్లీ పర్యటనలతో కాలక్షేపం చేస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఘాటుగా విమర్శించారు. ట్యాంక్‌బండ్ నుంచి ప్రారంభమయ్యే ఈ పాదయాత్ర ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి బిజెపి గట్టి హెచ్చరికలు జారీ చేయనుంది. అమిత్ షా రాకతో బిజెపి శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిస్తుండగా,అధికార కాంగ్రెస్ దీనిపై ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

పేద ప్రజలకు మరిన్ని సరుకులు

హైదరాబాద్, అక్టోబరు 29 కరవు పరిస్థితులు తలెత్తవచ్చన్న ఆందోళనల నేపథ్యంలో పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం రేషన్ కార్డులపై పంపిణీ చేస్తున్న సన్నబియ్యంతో పా టు కందిపప్పు, గోధుమపిండి, పామాయిల్, చక్కెర, చింతపండు, కారంపొడి వంటి మరిన్ని సరుకులను అందించే ప్రతిపాదనను తీవ్రంగా పరిశీలిస్తోంది.ఈ ప్రతిపాదన సాధ్యాసాధ్యాలపై సమగ్రంగా అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల అవసరాలు, సరుకుల సేకరణకు ఏర్పాట్లు, ఎంత పరిమాణంలో ఇవ్వాలి? ఎంతకాలం కొనసాగించాలి? బడ్జెట్‌పై పడే భారం వంటి అంశాలను అంచనా వేయాలని సూచించారు. ఆర్థిక, లాజిస్టిక్స్ పరమైన అంశాలు కొలిక్కి వస్తే, వచ్చే సంక్రాంతి నాటికి ఈ పథకాన్ని ప్రారంభించే అవకాశం ఉందని తెలుస్తోంది.రాష్ట్రంలో ప్రస్తుతం 1.06 కోట్ల ఆహార భద్రత కార్డులపై సుమారు 3.42 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి నెలకు తలసరి 6 కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నారు. ఇందుకు నెలకు 2.18 లక్షల టన్నుల బియ్యం అవసరం. భవిష్యత్ అవసరాల దృష్ట్యా 14 నెలలకు సరిపడా ఆహార ధాన్యాల బఫర్ స్టాక్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం గోదాముల్లో 9.64 లక్షల టన్నుల బియ్యం నిల్వ ఉండగా, కస్టమ్ మిల్లింగ్ రైస్, ఇతర మార్గాల ద్వారా మరో 18.39 లక్షల టన్నులు సమకూరనున్నాయి. ఈ నిల్వలు 2027 సెప్టెంబర్ వరకు సరిపోతాయని అధికారులు భావిస్తున్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో రేషన్ షాపుల ద్వారా పలు రకాల నిత్యావసరాలను అందించేవారు. 2023లో అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ కూడా ఇదే తరహాలో పంపిణీని విస్తరిస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ దిశగానే ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బహిరంగ మార్కెట్‌లో ధరల పెరుగుదల నుంచి ప్రజలను ఆదుకోవడమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందిస్తున్నారు. అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా ఏయే సరుకులు ఎంత పరిమాణంలో ఇవ్వాలనే దానిపై కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుంది.

వడ్లకు రికార్డ్ ధర.. జై శ్రీరామ్ రికార్డ్

తెలంగాణ రైతులకు ఈ ఖరీఫ్ సీజన్ సిరుల పంట పండిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో వరి ధాన్యానికి ఎన్నడూ లేనంత రికార్డు స్థాయిలో ధర లభిస్తోంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో 'జై శ్రీరామ్' రకం వడ్లు ఏకంగా క్వింటాలుకు రూ. 5,016 పలికి ఆల్ టైమ్ రికార్డు సృష్టించాయి. రాష్ట్రవ్యాప్తంగా నల్గొండ, కరీంనగర్, ఖమ్మం వంటి జిల్లాల్లో సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 3,000 నుంచి రూ. 3,500 వరకు ధర లభిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు గతేడాదితో పోలిస్తే సుమారు 14 శాతం తగ్గడం, ఎల్ నినో ప్రభావం వంటి కారణాలతో దిగుబడిపై అంచనాలు మారాయి. ఇదే సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు వంటి పొరుగు రాష్ట్రాల నుంచి ప్రైవేట్ వ్యాపారులు, రైస్ మిల్లర్ల నుంచి భారీ డిమాండ్ ఏర్పడింది. కొందరు వ్యాపారులు రైతులకు అడ్వాన్సులు ఇచ్చి మరీ పంటను కొనుగోలు చేస్తుండటంతో బహిరంగ మార్కెట్‌లో పోటీ పెరిగింది. ఫలితంగా, ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్ ధర చాలా ఎక్కువగా ఉండటం గమనార్హం. ప్రభుత్వం ఏ-గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,461 మద్దతు ధర ప్రకటించగా, ఎంపిక చేసిన 7 సన్న రకాలకు రూ. 500 బోనస్ ఇస్తోంది. దీంతో ప్రభుత్వానికి అమ్మితే రైతుకు గరిష్ఠంగా రూ. 2,961 లభిస్తుంది. అయితే, బహిరంగ మార్కెట్‌లో రూ. 3,500 ధర పలుకుతుండటంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వైపు చూడటం లేదు. ఇది ప్రజా పంపిణీ వ్యవస్థ (ఖజా) కోసం సన్న బియ్యాన్ని సేకరించాలనుకుంటున్న ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. మరోవైపు, ఈ ధరల పెరుగుదల ప్రభావం సామాన్య వినియోగదారులపై పడుతోంది. రిటైల్ మార్కెట్‌లో సన్న రకం బియ్యం కిలో ధర రూ. 90 నుంచి రూ. 100కి చేరింది."వరికి ఒక్కసారిగా ఇంత ధర పెరుగుతుందని అనుకోలేదు. పెరిగిన ధరలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది" అని ఓ రైతు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాగా, సన్న రకం బియ్యం ధరల పెరుగుదలకు ఎల్ నినో ప్రభావమే కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో తాను సన్న రకం వరి సాగును ప్రోత్సహించినప్పుడు విమర్శలు వచ్చాయని, కానీ ఇప్పుడు దాని ప్రయోజనం రైతులకు అందుతోందని ఆయన వ్యాఖ్యానించారు.ప్రస్తుతం 'జై శ్రీరామ్' రకంతో పాటు, ఆర్ఎన్ఆర్ వంటి ఇతర సన్న రకాలకు కూడా క్వింటాలుకు రూ. 4,300 వరకు ధర పలుకుతోంది. రాబోయే నవంబర్, డిసెంబర్ నెలల్లో పంట కోతలు పూర్తిస్థాయికి చేరిన తర్వాత ధరల తీరు ఎలా ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

ఈఎస్ఐ హౌస్ కీపింగ్‌లో ఏం జరుగుతోంది?

హైదరాబాద్, అక్టోబరు 29 తెలంగాణలోని ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల ఖర్చు భారీగా పెరిగింది. ఈ సేవలకు చెల్లించే చార్జీలను ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) అధికారులు భారీగా పెంచడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2024లో చదరపు అడుగుకు రూ.10గా ఉన్న చార్జీని 2025లో రూ.25కు, తాజాగా రూ.49.50కు పెంచారు. కొన్ని చోట్ల అంతకంటే ఎక్కువ చెల్లింపులకు అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. దీంతో గతేడాదితో పోలిస్తే 2026లో ఈ సేవలపై దాదాపు రూ.50 కోట్ల అదనపు భారం పడుతోంది. టెండర్లు నిర్వహించకుండా నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు అప్పగించడంపై కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.అద్దె కంటే తొమ్మిది రెట్లు ఎక్కువ ఖర్చు ఖైరతాబాద్‌లో 3,060 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈఎస్ఐ డిస్పెన్సరీ అద్దె భవనంలో కొనసాగుతోంది. చదరపు అడుగుకు రూ.15 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ చదరపు అడుగుకు రూ.10 అద్దె చెల్లించాలని నిర్ణయించినప్పటికీ, భవనాల లభ్యత, డిమాండ్‌ను బట్టి యజమానితో చర్చించి అద్దెను ఖరారు చేశారు. దీంతో ప్రభుత్వం నెలకు దాదాపు రూ.45,900 చెల్లిస్తోంది. కేన్సర్ చికిత్సలో కొత్త ప్రయోగాలు అయితే, ఇదే భవనంలో హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల కోసం నెలకు దాదాపు రూ.4.15 లక్షలు ఖర్చు చేస్తుండటం గమనార్హం. భవనం అద్దెతో పోలిస్తే ఈ వ్యయం తొమ్మిది రెట్లు ఎక్కువ. హౌస్ కీపింగ్‌కు చదరపు అడుగుకు రూ.70.49, సెక్యూరిటీ సేవలకు రూ.65.17 చొప్పున చెల్లిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలోని ఇతర డిస్పెన్సరీల్లోనూ ఇదే తరహాలో అధిక వ్యయం చేస్తున్నట్లు ఐఎంఎస్ లెక్కలు సూచిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ప్రాంతీయ ఈఎస్ఐ ఆస్పత్రులు, రెండు డయాగ్నొస్టిక్ కేంద్రాలు, 71 డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటిలో 53 డిస్పెన్సరీలు హైదరాబాద్ రీజియన్ పరిధిలో, 18 వరంగల్ రీజియన్ పరిధిలో ఉన్నాయి. రాష్ట్రంలో 21 లక్షల మంది ఈఎస్ఐ చందాదారులు ఉండగా, వారి కుటుంబసభ్యులతో కలిపి 90 లక్షల నుంచి కోటి మంది వరకు వైద్య సేవలు పొందుతున్నారు. చార్జీలు పెరిగినా ఉద్యోగులకు అందని ప్రయోజనం ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల బాధ్యతలను ఐఎంఎస్ డైరెక్టరేట్ పర్యవేక్షిస్తోంది. కాంట్రాక్టర్ల ఎంపిక, ధరల నిర్ణయం, బిల్లుల చెల్లింపులు ఈ విభాగం పరిధిలోనే జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,78,455 చదరపు అడుగుల విస్తీర్ణానికి ఈ సేవలు అందించాల్సి ఉంది. హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల చార్జీని చదరపు అడుగుకు రూ.49.50కు పెంచుతూ ఐఎంఎస్ డైరెక్టర్ ఈ నెల 15న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ధరలకు జీఎస్టీ అదనం. 2028 జనవరి నుంచి డిసెంబర్ వరకు ఈ ధరలు అమల్లో ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, కొన్ని ప్రాంతాల్లో హౌస్ కీపింగ్‌కు చదరపు అడుగుకు రూ.70.15 వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఖైరతాబాద్‌లో ఈ మొత్తం రూ.70.49గా ఉంది 2020 నుంచి చదరపు అడుగుకు రూ.10 చొప్పునే చెల్లిస్తున్నారంటూ సీఎం ప్రజావాణికి పలువురు వినతులు సమర్పించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సంస్థలు చార్జీలు పెంచాలని కోరడంతో 2025 మేలో చదరపు అడుగుకు రూ.25 చెల్లించేలా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. తాజాగా ఈ మొత్తాన్ని రూ.49.50కు పెంచారు. కొన్ని చోట్ల అంతకంటే ఎక్కువ చెల్లించేందుకు కూడా అనుమతులు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, చార్జీలు పెరిగినా ఉద్యోగులకు పెద్దగా ప్రయోజనం కలగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చాలాచోట్ల హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సిబ్బందికి నెలకు రూ.12 వేల నుంచి రూ.15 వేల మధ్యే వేతనాలు చెల్లిస్తున్నారు. చార్జీల పెంపుతో ఉద్యోగులకు కనీసం రూ.35 వేలకు పైగా వేతనం అందాల్సి ఉన్నప్పటికీ, ఆ ప్రయోజనం కాంట్రాక్టర్లకే దక్కుతోందనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు, ఉద్యోగులకు సంబంధించిన ఈఎస్ఐ, ఈపీఎఫ్ నిధులు నెల నెలా జమ కావడం లేదని సమాచారం. ఈ సమస్యపై నాచారం ప్రాంతీయ ఆస్పత్రిలో ఉద్యోగులు గత వారం మూడు వారాల పాటు నిరసనలు, ఆందోళనలు చేపట్టినట్లు కథనంలో పేర్కొన్నారు. నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టుల అప్పగింత ప్రభుత్వ శాఖల్లో రూ.5 లక్షలు దాటిన పనులకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లను ఎంపిక చేయాల్సి ఉంటుందని కథనం పేర్కొంది. అయితే, ఐఎంఎస్‌లో కోట్ల రూపాయల విలువైన హౌస్ కీపింగ్, సెక్యూరిటీ పనులను టెండర్లు లేకుండానే నామినేషన్ పద్ధతిలో కొన్ని సంస్థలకు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. చార్జీల పెంపు, కాంట్రాక్టర్ల ఎంపిక, బిల్లుల చెల్లింపుల వెనుక ముడుపుల వ్యవహారం ఉందంటూ కార్మిక వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఐఎంఎస్ డైరెక్టరేట్‌లోని ఓ జాయింట్ డైరెక్టర్ ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. 2024లో ఈ సేవల కోసం రూ.10.50 కోట్లు ఖర్చు చేయగా, గతేడాది రూ.26.35 కోట్లు వ్యయమైంది. 2028 ఆర్థిక సంవత్సరానికి ఈ ఖర్చు రూ.78.5 కోట్లకు పైగా చేరినట్లు కథనంలో పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి దాదాపు రూ.50 కోట్ల అదనపు వ్యయం నమోదవడంపై కార్మికులు, ఉద్యోగులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. చార్జీల పెంపు, టెండర్లు లేకుండా కాంట్రాక్టుల అప్పగింతపై కొందరు ఇప్పటికే కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం.

తెలంగాణలో కరవు కోరలు..

31 జిల్లాల్లోని 365 మండలాల్లో తీవ్ర ప్రభావం

హైదరాబాద్, అక్టోబరు 29 తెలంగాణలో నెలకొన్న ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం 33 జిల్లాలకు గాను పెద్దపల్లి, హైదరాబాద్ మినహా 31 జిల్లాల్లోని 365 మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నట్లు ప్రకటించింది. వీటిలో 111 మండలాల్లో తీవ్రస్థాయిలో, 254 మండలాల్లో మధ్యస్థంగా కరవు పరిస్థితులు ఉన్నట్లు తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరవు ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే చర్యలు ప్రారంభించాలని కలెక్టర్లను ఆదేశించారు.ఈ ఏడాది వర్షాకాలంలో (జూన్ నుండి సెప్టెంబరు) ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 17 శాతం లోటు వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం 740.6 మి.మీ. ఉండాల్సింది పోయి కేవలం 615.5 మి.మీ. మాత్రమే నమోదైంది. వానాకాలం పంటల సీజన్ అక్టోబరు 30తో ముగుస్తుండటంతో విపత్తుల నిర్వహణ చట్టం-2005 ఆధారంగా ఈ కరవు మండలాల ప్రకటనను విడుదల చేశారు.18 జిల్లాల్లో సాగు నీరు లేక పంటల విస్తీర్ణం పడిపోయింది. రాష్ట్రంలో సాధారణంగా 139.28 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా, కేవలం 126.06 లక్షల ఎకరాలకు పరిమితమైంది.వరి సాగు విస్తీర్ణం 69.19 లక్షల ఎకరాల నుంచి 57 లక్షల ఎకరాలకు (18% తక్కువ) పడిపోయింది. భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల్లో 585 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గాను ప్రస్తుతం కేవలం 179.63 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ ఉత్పత్తితో పాటు పశువుల మేతకు తీవ్ర కొరత ఏర్పడింది. సూర్యాపేట, నారాయణపేట, జోగులాంబ గద్వాల, హనుమకొండ, సంగారెడ్డి, వికారాబాద్‌లలోని అన్ని మండలాలను కరవు బాధిత ప్రాంతాలుగా ప్రకటించారు.

తక్షణ ఉపశమన చర్యలు

కరవు తీవ్రతను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లకు పలు కీలక ఆదేశాలు ఇచ్చింది. ఎస్డీఆర్ఎఫ్ నిధుల నుంచి అర్హులైన రైతుల ఖాతాల్లోకి నేరుగా పెట్టుబడి రాయితీ జమ చేయనున్నారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సహకారంతో పంట రుణాలను రీషెడ్యూల్ చేయాలని, బ్యాంకులు బలవంతపు వసూళ్లకు దిగకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. తాగునీటి ఎద్దడి లేకుండా మున్సిపాలిటీలు, అర్బన్ ఏరియాల్లో చర్యలు చేపట్టడంతో పాటు, పశువుల కోసం ప్రత్యేక శిబిరాలు, పశు గ్రాసం పంపిణీ చేపట్టాలని ఆదేశించింది. వీబీ జీరాంజీ కింద అదనపు ఉపాధి పనులను గుర్తించి కూలీలకు పనులు కల్పించనున్నారు. తీవ్ర కరవు ఉన్న మండలాల్లో 7 రోజుల్లోగా గ్రామస్థాయి డేటాను సేకరించి కేంద్ర వ్యవసాయ, హోం శాఖలకు పంపాలని ప్రణాళికా శాఖను ఆదేశించింది. కరవును ఎదుర్కొనేందుకు రూ.20,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. తక్షణమే కేంద్ర బృందాలను పంపి నష్టాన్ని అంచనా వేయాలని, విపత్తు నిర్వహణ నిధులను విడుదల చేయాలని కోరింది. ఉపాధి హామీ (వీబీ జీరాంజీ) కింద 100 శాతం కేంద్ర నిధులతో అదనంగా 50 పనిదినాలను కల్పించాలని విజ్ఞప్తి చేసింది. 1,500 మెగావాట్ల అదనపు విద్యుత్, అదనపు ఎరువులతో పాటు 2026-27 ఎఫ్ఆర్‌బీఎం రుణ పరిమితిని 3 శాతం నుండి 3.5 శాతానికి పెంచాలని శాసనసభ తీర్మానం మేరకు కేంద్రానికి నివేదించింది.

ఎర్రవల్లిలో 45 ఎకరాలు

మెదక్, అక్టోబరు 29 కేసీఆర్ ఫాంహౌస్ పరిసర ప్రాంతాల చుట్టూ మరోసారి రాజకీయ రగడ మొదలైంది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామ శివార్లలోని సర్వే నంబర్ 325 చుట్టూ ఇప్పుడు చర్చ నడుస్తోంది. రికార్డుల్లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా.. సర్వేలో 343 ఎకరాలు మాత్రమే బయటపడింది. దీంతో 45 ఎకరాలు మిస్ అయినట్లు అధికారులు గుర్తించారు. ఇప్పుడీ అంశం రాజకీయాల్లో కీలకంగా మారింది. ఈ భూమి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు ఆనుకుని ఉంది. దీంతో దీనిపై ఉత్కంఠ నెలకొంది.కేసీఆర్ ఫాంహౌస్ లో ఆక్రమిత భూమి ఉందంటూ సెప్టెంబర్ లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన చేశారు. అంతేకాక, ఈ అంశంపై రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించాలని ఆదేశించారు. దీంతో అధికారులు సర్వే చేశారు. మొదటి దశ సర్వేలో రైతుల కబ్జాలోని భూములు, హద్దులు గుర్తించిన తర్వాత రీసర్వే చేపట్టారు. అధికారులు ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో స్థానికుల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ చర్చ మొదలైంది. కేసీఆర్ కుటుంబ సభ్యుల భూములు ఈ సర్వే నంబర్‌కు ఆనుకుని ఉన్నాయని అధికారులు సీఎంకు నివేదించారు. దీంతో వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు వెళ్లాయి. అయితే ఇప్పటివరకు ఫామ్‌హౌస్‌లోకి అధికారులు వెళ్లలేదు. నోటీసులు కూడా అందించలేదు.బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూములను ఆక్రమించారని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. వాటిని స్వాధీనం చేసుకుని అర్హులైన రైతులకు, దళిత కుటుంబాలకు పంపిణీ చేస్తామని, అలాగే తెలంగాణ ఉద్యమ అమరవీరుల కుటుంబాలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అనవసరంగా రాజకీయం చేస్తోందని బీఆర్ఎస్ వర్గాలు విమర్శిస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ జరిగిన అభివృద్ధి, నీటి వనరులు, సరిహద్దు మార్పులపై ప్రశ్నలు లేవనెత్తడం ద్వారా ప్రతిపక్షాన్ని ఒత్తిడికి గురిచేస్తున్నారని వారి వాదన.

బిగ్ ప్లాన్ లో కేసీఆర్

హైదరాబాద్, అక్టోబరు 29 ఎగిసిపడే ప్రతి అలకూ తిరిగి పైకి లేచే నైజం ఉంటుంది... అనుభవించిన ఓటమి కంటే.. గుండెల్లో రగిలే ఆత్మగౌరవమే నాయకుడిని మళ్లీ ప్రజాక్షేత్రంలోకి నడిపిస్తుంది.. అలాంటి ఒక ఉద్వేగభరితమైన పోరాటానికి.. తన రాజకీయ జీవితంలో ఎన్నో తుఫాన్లను తట్టుకుని నిలబడిన గులాబీ దళపతి కేసీఆర్ మళ్లీ సిద్ధమవుతున్నారు. 2004లో తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన నాటి చారిత్రాత్మక వ్యూహాన్ని తిరిగి 2029లో పునరావృతం చేస్తూ.. ఒకవైపు గజ్వేల్ గడ్డపై ఎమ్మెల్యేగా.. మరోవైపు ఉత్తర తెలంగాణ ఉద్యమ నేలపై ఎంపీగా సమరశంఖం పూరించడానికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారనే వార్త ఇప్పుడు ప్రతి గులాబీ కార్యకర్త గుండెల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతోంది. తెలంగాణ రాజకీయాలు ఎప్పుడూ ఒక కొత్త మలుపు కోసం ఎదురుచూస్తూనే ఉంటాయి. విజయాలు.. అపజయాలు రాజకీయాల్లో సహజమే అయినా... మళ్లీ పుంజుకోవడం.. మళ్లీ ప్రజాక్షేత్రంలో తిరుగులేని శక్తులుగా నిలబడటమే అసలైన నాయకత్వానికి గురుతు. గులాబీ దళపతి కేసీఆర్ మళ్లీ తన మార్క్ రాజకీయ వ్యూహానికి పదును పెడుతున్నారనే వార్తలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి. 2029 రాబోయే సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ ఒక సరికొత్త, అసాధారణమైన వ్యూహంతో ముందుకు రాబోతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒకవైపు గజ్వేల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తూనే మరోవైపు ఉత్తర తెలంగాణలోని ఒక కీలక పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా బరిలోకి దిగేందుకు గులాబీ అధినేత సిద్ధమవుతున్నారట..2004 నాటి సెంటిమెంట్... పూర్వ వైభవం దిశగా గులాబీ జెండా ఇది కేవలం ఒక ఎన్నికల వ్యూహం మాత్రమే కాదు... తెలంగాణ గుండెచప్పుడును మళ్లీ మీటే ఒక ఉద్వేగభరితమైన ప్రయత్నం.. 2004 ఎన్నికల్లో కేసీఆర్ కరీంనగర్ ఎంపీగా.. సిద్దిపేట ఎమ్మెల్యేగా పోటీ చేసి సాధించిన అద్భుత విజయం.. ఆ తర్వాతి కాలంలో తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన తీరు ఎవరూ మరచిపోలేరు. సరిగ్గా పాతికేళ్ల తర్వాత అదే 2004 నాటి సెంటిమెంట్‌ను.. అదే వ్యూహాన్ని 2029లో పునరావృతం చేయాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఉత్తర తెలంగాణ ఎప్పుడూ గులాబీ దళానికి బలమైన కోట. ఉద్యమ కాలం నుంచి పార్టీకి అండగా నిలిచిన ఆ గడ్డపై కేసీఆర్ స్వయంగా ఎంపీగా పోటీ చేస్తే... ఆ ప్రాంతమంతటా ఒక కొత్త చైతన్యం వెల్లివిరుస్తుందని.. కేడర్‌లో నూరిపోసినట్లు నవనాడుల్లో ఉత్సాహం నిండుతుందని గులాబీ శ్రేణులు భావిస్తున్నాయి. కేసీఆర్ పోటీ చేయడం ద్వారా ఉత్తర తెలంగాణలోని మెజారిటీ అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలను క్లీన్ స్వీప్ చేయవచ్చని పార్టీ అంచనా వేస్తోంది. రాష్ట్రంలో తిరుగులేని అధికారం ఈ మాస్టర్ ప్లాన్ వెనుక కేవలం రాష్ట్రంలో అధికారంలోకి రావడం మాత్రమే కాదు.. కేంద్ర రాజకీయాల్లోనూ కీలక పాత్ర పోషించాలనే భారీ లక్ష్యం ఉంది. గజ్వేల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్రంలో పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడం ఎంత ముఖ్యమో... ఎంపీగా గెలిచి ఢిల్లీ పీఠం వద్ద తెలంగాణ గళాన్ని బలంగా వినిపించడం కూడా అంతే ముఖ్యమని కేసీఆర్ భావిస్తున్నారు. గరిష్ఠ సంఖ్యలో ఎంపీ స్థానాలను గెలుచుకోవడం ద్వారా కేంద్రంలో చక్రం తిప్పే శక్తిగా బీఆర్ఎస్ ను నిలబెట్టాలనేది ఈ వ్యూహం వెనుక ఉన్న అసలు ఉద్దేశం.

సంచలనమా... సవాలా? ఒక దశాబ్ద కాలం చేసిన అనుభవం, తెలంగాణను తీర్చిదిద్దిన శ్రమ, పదిలేదిన కేరటాల నుంచి మళ్లీ ప్రజల మధ్యకు వస్తున్న కేసీఆర్ మార్క్ రాజకీయం ఉమ్మడి తెలంగాణను మరోసారి ఊపేస్తుందనడంలో సందేహం లేదు. అయితే మారిన రాజకీయ సమీకరణలు.. ప్రత్యర్థుల వ్యూహాల నడుమ 2004 నాటి మ్యాజిక్‌ను కేసీఆర్ 2029లో మళ్లీ రీక్రియేట్ చేయగలుగుతారా? ఈ సరికొత్త వ్యూహంతో గులాబీ పార్టీకి పూర్వ వైభవం తెచ్చి రాజకీయ సంచలనానికి తెరతీస్తారా లేక ఈ వ్యూహం ఎలాంటి ఫలితాన్ని ఇస్తుంది? అనేది కాలమే నిర్ణయించాలి. తన రాజకీయ జీవితంలో ఎన్నో తుఫాన్లను తట్టుకుని నిలబడిన ఈ వ్యూహకర్త వేసే తదుపరి అడుగుపైనే ఇప్పుడు తెలంగాణ భవిష్యత్తు ఆధారపడి ఉందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు

యూపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కమలానికి షాక్ మొత్తం

11 స్థానాలకు గాను బీజేపీ 6, ఎస్పీ 5 చోట్ల విజయం

గతంతో పోలిస్తే రెండు స్థానాలు అదనంగా గెలుచుకున్న సమాజ్‌వాదీ పార్టీ

2027 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కీలకంగా మారిన ఎన్నికలు

కౌంటింగ్‌లో అక్రమాలు జరిగాయని అఖిలేశ్ యాదవ్ ఆరోపణ

లక్నో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సుమారు ఐదు నెలల ముందు జరిగిన శాసనమండలి ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు చెందిన 11 ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఈ ఎన్నికల్లో అధికార బీజేపీ ఆరు స్థానాలను కైవసం చేసుకోగా, ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఐదు స్థానాల్లో గెలిచి అనూహ్యమైన పురోగతి కనబరిచింది. అక్టోబర్ 23న బ్యాలెట్ పత్రాల ద్వారా ఈ ఎన్నికల పోలింగ్ జరగ్గా, అక్టోబర్ 27న ప్రారంభమైన కౌంటింగ్ ప్రక్రియ దాదాపు ఒక రోజుకు పైగా కొనసాగింది. మొత్తం 11 స్థానాల్లో ఐదు పట్టభద్రుల, ఆరు ఉపాధ్యాయ నియోజకవర్గాలు ఉన్నాయి. 2020లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ 6, ఎస్పీ 3 స్థానాల్లో గెలుపొందగా, రెండు స్థానాలు స్వతంత్రులకు దక్కాయి. తాజా ఫలితాలతో పోలిస్తే బీజేపీ తన స్థానాలను నిలబెట్టుకోగా, ఎస్పీ రెండు సీట్లు అదనంగా గెలుచుకుని తన బలాన్ని పెంచుకుంది. ఆరోపణలు, రాజకీయ ప్రకంపనలు: కౌంటింగ్ ప్రక్రియ పలుచోట్ల ఉద్రిక్తతలకు దారితీసింది. గోరఖ్‌పూర్–ఫైజాబాద్, వారణాసి వంటి స్థానాల్లో ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయని ప్రతిపక్షాలు ఆరోపించాయి. గోరఖ్‌పూర్‌లో బీజేపీ అభ్యర్థి కేవలం 307 ఓట్ల స్వల్ప తేడాతో గెలవగా, ఓట్ల తారుమారు జరిగిందని ఒక స్వతంత్ర అభ్యర్థి ఆరోపించారు. ఆగ్రాలో తమ అభ్యర్థిపై దాడి జరిగిందని, ఆయన దుస్తులు చించివేశారని ఆరోపిస్తూ ఎస్పీ కార్యకర్తలు వీడియోలను పంచుకున్నారు. ఈ ఫలితాలపై ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. గోరఖ్‌పూర్, వారణాసిలలో అధికార యంత్రాంగం అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. "ఈ ఫలితాలు బీజేపీ పెట్టేబేడా సర్దేశాయి" అని వ్యాఖ్యానించారు. గెలిచిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందే వరకు అప్రమత్తంగా ఉండాలని, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించవద్దని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గెలుపొందిన సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు, పట్టభద్రుల ప్రయోజనాల కోసం పనిచేస్తూ, రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు జరిగిన ఈ ఎన్నికలను ఇరు పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా భావించాయి. అయితే, ఓటర్లు కేవలం పట్టభద్రులు, ఉపాధ్యాయులు మాత్రమే కావడంతో ఈ ఫలితాలను సాధారణ ఎన్నికలకు పూర్తిగా అన్వయించలేమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

లక్ష్మీపురంలో రోడ్డు ప్రమాదం..

డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అడ్డంగా పడిపోయిన కర్రల లారీ

తిరువూరు లక్ష్మీపురం గ్రామంలోని వాటర్ ట్యాంక్ ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వస్తున్న కర్రల లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ఘటనతో రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడే పరిస్థితి నెలకొంది.

ప్రాధాన్య అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి.

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

అభివృద్ధి పనుల్లో ఆలస్యం లేకుండా సమన్వయంతో అధికారులు ముందుకు సాగాలి

ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్లు, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 29: నియోజకవర్గం లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి పెండింగ్ లేకుండా సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

పాలేరు నియోజకవర్గం ఏదులాపురం మున్సిపాలిటీ మద్దులపల్లి లో చేపట్టిన జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్ భవనాలు, ప్రధాన భవనం, అకాడమిక్ బ్లాక్ నిర్మాణాల పనుల నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. నిర్ణీత సమయానికి, క్వాలిటీ తో వేగంగా నిర్మాణాలు జరగాలని,

కార్మికులను పెంచి అనుసంధానంగా పనులు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, విద్య, వైద్యం అభివృద్ధికి కీలకమైన కళాశాల భవనాల నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తూ, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతలో రాజీ పడకుండా, ఇంజనీరింగ్ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

పనుల సందర్భంగా అవసరమైన నిర్మాణ సామగ్రి నాణ్యతను నిరంతరం పరీక్షించాలని, ప్రతి దశను ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో చేపట్టాలని ఆదేశించారు.

అభివృద్ధి పనుల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆనతరం వెంకటగిరి లో అసంపూర్తిగా ఉన్న జి ప్లస్ 2 భవనాలను కలెక్టర్ పరిశీలించారు. వాటిని ప్రజలకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మద్దులపల్లి మార్కెట్ కమిటి ఛైర్మెన్ హరినాథ్ బాబు, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ మహేష్ బాబు, ఖమ్మం రూరల్ తహసీల్దారు వినయేంద్రరెడ్డి, వైద్యశాఖ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు కూతుళ్లతో తల్లి ఆత్మహత్య

మెదక్ పిల్లల్ని పెంచే స్థోమత లేక ఒక తల్లి తన ఇద్దరు కూతుళ్లతో తల్లి ఆత్మహత్య చేసుకుంది. మెదక్ జిల్లా ఏడుపాయల సమీపంలోని మంజీరా నదిలో తల్లి, ఇద్దరు చిన్నారులు దూకారు. మృతులు మాల్కాపూర్కు చెందిన సరిత (27), కుమార్తెలు వైష్ణవి (7), శాన్విక (6). సరిత భర్త కొన్నేళ్ల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచి కూలి పనులు చేసుకుంటూ సరిత జీవనం కొనసాగిస్తోంది. పిల్లల పోషణ భారంగా మారడంతో తీవ్ర మనస్తాపం చెందిందని సమాచారం. నదిలో దూకే ముందు తన తండ్రికి ఫోన్ చేసి తన ఆవేదనను తెలిపింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు ప్రారంభించారు..

నాన్నంటే ఎన్నటికీ అర్థం కాని ఓ ఎమోషన్..!

నాన్న కి ప్రేమతో ...

మనం ఈ భూమి మీద జీవం పోసుకున్నామంటే దానికి సూత్రధారులు అమ్మ, నాన్నే. ఒకరు తొమ్మిది నెలలు భారం మోస్తే, మరొకరు జీవితాంతం బాధ్యత వహిస్తారు. భారం కష్టం అందరూ చెప్తారు కానీ బాధ్యత వెనక ఉన్న ఒక తండ్రి ఆవేదన కోసం చాలా తక్కువ గా చర్చిస్తారు అందరూ అమ్మ కోసమే మాట్లాడతారు అమ్మ ఎన్నో కష్టాలు పడి పెంచింది, పెద్ద చేసింది అని. వాస్తవమే తల్లి పడిన కష్టాన్ని వెల కట్టలేం, వర్ణనాతీతం అది. అలానే నాన్న పడిన కష్టం కూడా మాటల్లో చెప్పలేనిది. నాన్న కష్టం కోసం మాట్లాడేవారు, పట్టించుకునే వారు చాలా అరుదుగా కనిపిస్తారు. అమ్మ జన్మనిస్తే, ఆ జన్మకి సార్ధకత నాన్న వల్ల వస్తుంది. నిరంతరం మన వెనకాల ఉండి, మనందర్ని గెలిపించి, ఆ ఘనత కూడా తీసుకోని పెద్ద మనసు గల ఒకే ఒక వ్యక్తి నాన్న. పగలు కళ్ళు తెరిచిన దగ్గరనుండి మళ్ళీ నిద్ర పోయే వరకు ప్రతి క్షణం నా భార్య, నా పిల్లలు, నా ఇల్లు అని ఎండా వాన, పగలు రాత్రి అన్న తేడా లేకుండా కష్టపడి డబ్బులు సంపాదించేది నాన్న. తనకంటూ ఏ స్వార్థం లేకుండా తాను ఒక పూట పస్తు ఉండి అయినా సమయానికి అన్ని చేకూర్చేది నాన్న మాత్రమే. వంట్లో నలత గా ఉన్నా, ఒక్క రోజు పనికి వెళ్లకపోతే నా పిల్లలు ఆడిగినవి ఇవ్వలేకపోతానేమో అన్న భయంతో, ఓపిక తెచ్చుకుని పనికి వెళ్ళిపోతాడు నాన్న. నాన్న అంటేనే పౌరుషం. అమ్మలా కొన్ని విషయాల్లో జాలిపడి పోయే రకం కాదు. ఆ కఠినత్వం, ఆ రౌద్రం తన బిడ్డ భవిష్యత్తు బాగుండాలని మాత్రమే. ఏడవడం మగవారి లక్షణం కాదని అనేస్తాం. ఏం మగవారికి మనసు లేదా? వారికి బాధ వేయదా?. ఏ బాధనైనా గుండెల్లో నింపుకుని బయట గంభీరంగా కనపడతారు నాన్న. తాను బాధపడుతున్నాడని ఎప్పుడూ పక్కనున్న భార్య కి కూడా తెలియనివ్వడు తను బాధపడుతుంది అని, అంత కోమలమైన మనస్సు ఆయనది. కొడుకు తండ్రి పౌరుషం అయితే, కూతురు తండ్రి నమ్మకం. నాన్న నమ్మకాన్ని కూతురు ఎప్పుడూ కాపాడుతుంది అన్న నమ్మకం తో, పుట్టిన దగ్గర నుండి చివరి వరకు గుండెల్లో దాచుకుంటాడు. కొడుకు వంశాభివృద్ధి కి కారకుడు, ఎప్పుడూ తండ్రి తోనే ఉంటాడు. కొడుకు తన కన్నా పది అడుగులు ఎత్తుకి ఎదగాలని నిరంతరం శ్రమిస్తాడు. తన కన్నా ఎత్తుగా ఎదిగిన కొడుకుని చూసి అందరికన్నా ఎక్కువ గర్వ పడేది, ఆనంద పడేది తండ్రి మాత్రమే. ఆ రోజు కోసమే తన జీవితం ధార పోసేస్తాడు. ప్రస్తుత సమాజంలో కొడుకు తన భాధ్యత మరిచిపోయనా, నా కొడుకు ఎక్కడున్నా పిల్ల పాపలతో, సుఖంగా ఆరోగ్యంగా ఉండాలని ప్రతి రోజు దేవుడ్ని మనసులో కోరుకుంటూనే ఉంటాడు. ప్రపంచమంతా నీకు వ్యతిరేకంగా వున్నప్పుడు, నేనున్నాను అని వెనక నిలుచునేది నాన్న ఒక్కరే. నువ్వు గెలిచినప్పుడు పది మందికి గర్వంగా చెప్పుకుని ఆనందపడేది నాన్న ఒక్కరే. కోపంగా మాట్లాడితే నాన్నకి ప్రేమగా మాట్లాడడం రాదని అనుకున్నా, మౌనంగా మాట్లాడకుండా కూర్చుంటే , మాతో మాటలు ఆడడం ఆయనకి ఇష్టం లేదని అని అనుకున్నా, ఒక బిడ్డకి నాన్న మనసు, తను తండ్రి అయినప్పుడే అర్థం అవుతుంది. ఆకోపం వెనక ఉన్న నీ ప్రేమ, ఆ మౌనం వెనక ఉన్న నీ భావం, అతి చనువుగా ఉంటే మేము మీ మాట వినకుండా గారాబం ఎక్కువైపోతుందని ఆ ప్రవర్తన కి అంతరార్థం అని , అది మేము అనుభవిస్తేగాని అర్థం కాలేదు మాకు. తీసే ప్రతి ఊపిరి నీ భిక్షే నాన్న, ఏం చేయను నీ రుణం తీర్చుకోవడానికి . అమ్మలా మనసులో భావాలు వ్యక్తపరచలేరు, గంభీరత్వం అతని నైజం కనుక. పిల్లలుగా ఆయన్ని అర్థం చేసుకోవడం మన ధర్మం. నాన్నకు గుప్పెడంత నమ్మకం, ఎప్పుడూ మీరు అందరికన్నా గొప్పే నాన్న అన్న భరోసా ఇస్తే చాలు, ఆయన జీవితాంతం సంతోషంగా ఉండడానికి. ఎప్పుడూ మదర్స్ డే కి ప్రాధాన్యత ఇచ్చేవాళ్ళు మెల్లగా నాన్న ని కూడా అభిమానించడం మొదలుపెట్టేరని అర్థమౌతోంది. ఈ ఒక్కరోజే కాక ప్రతి రోజు ఆయన గొప్పతనాన్ని గుర్తు చేసుకోగలిగితే అదేఆయనకి మనం ఇచ్చే గౌరవం, మర్యాద. అమ్మా,పిల్లలూ ఒక్కటౌతుంటారు ఈ సృష్టిలో. నాన్న ఎప్పుడూ తుంటరివాడే, అమ్మమాత్రమే తరుచూ మంచిది అవుతూ ఉంటుంది, పిల్లల దృష్టిలో.కని,పెంచటం అమ్మేఅన్నట్లు కనిపిస్తుంది,నాన్నబాధ్యత ఏమీ లేనట్టు అనిపిస్తుంది.కనటం అమ్మేఅయినా కలలుకనటం నాన్న పనేనని ఎంతమంది పిల్లలకు అర్థమౌతుంది?పెంచటం అమ్మే అయినా బాధ్యతెరిగి పెరగటం నాన్నవల్లేనని, కొంత మంది పిల్లలకే బోధపడుతుంది. సేవచేయటం అమ్మవంతు, సరిచేయటం నాన్నతంతు. అమ్మకు ఎప్పుడూ పిల్లలలోని గుణాలే కనబడుతాయి,నాన్నకు మాత్రం పిల్లలలోని గుణాలతోపాటు దోషాలు కూడా కనబడుతాయి. ప్రేమించటం అమ్మ వంతు అయితే, దీవించటం నాన్నవంతు. ఆకలి తీర్చటం అమ్మవంతు అయితే, ఆశలు తీర్చటం నాన్నవంతు. అమ్మ ప్రేమ అనుక్షణం బహిర్గతమౌ తుంటుంది, నాన్న దీవెన ప్రతిక్షణం అంతర్గతంగానే ఉంటుంది.అమ్మగుండెలో పిల్లల సుఖానికి సంబంధించిన ఆలోచనే ఉంటుంది. నాన్నగుండెలో పిల్లల క్షేమానికి అను బంధించిన ఆవేదనే ఉంటుంది. అమ్మ ఆరాటాన్ని కన్నీళ్లు చెపుతాయి, నాన్నఆత్రుతని కళ్ళు మాత్రమె చెపుతాయి. కనిపించే ఆరాటం అమ్మది, కనిపించని పోరాటం నాన్నది.అమ్మకి లైకు లెక్కువ, నాన్నకి షాకులెక్కువ.అమ్మ ఏడవటం కనిపిస్తుంది, నాన్నఏడ చెరువవటం కనిపించదు. గుర్తింపు తెచ్చుకున్న దేవత అమ్మ,గుర్తింపు పొందలేని దేవుడు నాన్న.పిల్లల జీవితానికి అమ్మ ఒకకళ అయితే,నాన్న తళతళ.కనిపించే దేవత అమ్మ అయితే, కనపడని దేవుడు నాన్న.పిల్లల ఓట్లే అమ్మకు ఆస్తి, నాన్నకు మాత్రం అన్నీ నాస్తి.

తెలంగాణకు కేంద్రం రూ.50 వేల కోట్ల నిధులు ప్రకటించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

తాండూరు ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో పంటలు తీవ్రంగా నష్టపోయి రైతులు కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నారని, వారిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రూ.50 వేల కోట్ల ప్రత్యేక నిధులు ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. గురువారం మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలో ఎల్‌నినో ప్రభావంతో దెబ్బతిన్న పత్తి పంటలను సీపీఎం రాష్ట్ర బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.మంచిర్యాల జిల్లాలో 11 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ తాండూరు మండలాన్ని విస్మరించడం అన్యాయమన్నారు. తాండూరు మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. నష్టపోయిన వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు, ఆహార పంటలకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పంట నష్టంపై ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి రైతులకు అండగా నిలవాలన్నారు.నిత్యావసర ధరలను తగ్గించాలికరువు పరిస్థితుల నేపథ్యంలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని, బియ్యం కిలో రూ.90కి చేరడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జాన్ వెస్లీ పేర్కొన్నారు. ప్రభుత్వం ధరలను నియంత్రించి, రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను సబ్సిడీపై పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించాలిఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ పనులు తగ్గి కూలీలకు ఉపాధి దొరకడం లేదని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి, రోజుకు రూ.800 కూలి చెల్లించాలని కోరారు. వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ భరోసా పథకం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అఖిలపక్షాన్ని కలుపుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులు, వ్యవసాయ కూలీలు, పేద ప్రజలను ఆదుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కరువు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.సీపీఎం రాష్ట్ర బృందానికి సన్మానంతాండూరు మండల కేంద్రంలోని ఐబీ వద్ద సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీతో పాటు రాష్ట్ర బృందం సభ్యులను శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. అబ్బాస్, భూపాల్, ఎం.వి. రమణ, ఆశన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు నగేష్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా కార్యదర్శి బోడంకి చందు, గోమాస ప్రకాష్, గుమాస అశోక్, దాగం రాజారాం, సాంబార్ వెంకటస్వామి, దాగం శ్రీకాంత్, పాయిరాల రాములు, దుర్గం నాన్నయ్య, బొల్లం రాజేశం, కొమ్మ రాజయ్య తదితర సీపీఎం నాయకులు, రైతులు, కౌలుదారులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పేరుతో నకిలీ సంఘం పై చర్యలు తీసుకోండి

రాష్ట్ర డీజీపీకితెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఫౌండర్ చైర్మన్ డా. చీమ శ్రీనివాస్ పిర్యాదు

హైదరాబాద్ అక్టోబర్ 29; తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సభ్యులం. గత 9 సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమం కోసం రాజ్యాంగ బద్ధంగా పని చేస్తున్నాము.ఇట్టి విషయాన్ని గత మే నెలలో మీకు సమర్పించిన వినతి పత్రం. పమర్పించాలు. ఈ విషయంలో మీ దృష్టికి కొన్ని అత్యంత ముఖ్యమైన అంశాలు తీసుకువస్తున్నాము .2026 జనవరిలో కొంతమంది వ్యక్తులు మా "తెలంగాణ ఉద్యమకారుల ఫోరం" పేరుతోనే మరో సంఘాన్ని రిజిస్టర్ చేసుకున్నారు.

ఆ నకిలీ సంఘం పేరుతో "అసెంబ్లీ ముట్టడి, సెక్రటేరియట్ ముట్టడి, కలెక్టరేట్ ముట్టడి, సీఎం ఇల్లు ముట్టడి" అంటూ ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పిలుపునిస్తున్నారు. వారుపిలుపు నిస్తున్నందువల్ల రాష్ట్ర వ్యాప్తంగా అసలైన మా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులను, నాయకురాండ్రను పోలీసులు అరెస్టులు చేస్తున్నారు. దీనివల్ల మా సంఘ ప్రతిష్ట దెబ్బతింటుంది.అంతేకాకుండా కరీంనగర్ కేంద్రంగా FIR కాపీలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేస్తున్నారు" అని దిశ పేపర్ లో కూడా వార్తలు వచ్చాయి. దీనిపై మే నెలలోనే మీకు లేఖ ద్వారా ఫిర్యాదు చేయడం జరిగింది కావున తమరిని కోరుతున్నది ఏమనగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పేరుతో ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్న వారికి, మరియు FIR ల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న వారికి మా అసలైన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (9yrs) కి ఎటువంటి సంబంధం లేదని మనవి చేస్తూ, వారిపై తక్షణమే విచారణ జరిపి తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ మహిళా ఐక్యవేదిక కార్యాలయం ప్రారంభం

మేడ్చల్ అక్టోబర్ 29;తెలంగాణ మహిళా ఐక్యవేదిక కార్యాలయాన్ని మేడ్చల్ జిల్లా బాలాజీ నగర్ లోని ముత్తుస్వామి వికలాంగుల కాలనీలో గురువారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఐక్యవేదిక అధ్యక్షురాలు దండు లక్ష్మీ ముదిరాజ్ మాట్లాడుతూ రోజురోజుకు మహిళల పట్ల ఆగడాలు, అరాచకాలు, వేధింపులు పెరుగుతున్నాయని మహిళలకు రక్షణగా వారి సమస్యల పరిష్కారం కోసం తాము తెలంగాణ మహిళా ఐక్యవేదికను ప్రారంభించినట్లు తెలిపారు .మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తమ సంఘాన్ని సంప్రదించిన తో వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో మంజుల జి .ఉపేంద్ర పి. లక్ష్మి , ది.విలీన, ఈ .యాదమ్మ మమత, నిర్మల, ఎల్లమ్మ, కరుణ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు

ప్రతిపక్ష డిమాండ్ అహేతుకం, ఆమోదయోగ్యం కాదు

తెలంగాణ బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్. వి. సుభాష్

హైదరాబాద్, అక్టోబర్ 29: నవంబర్ 1న జరిగే ర్యాలీ కోసం తమ కార్యకర్తలను న్యూఢిల్లీకి తరలించడానికి ప్రత్యేక రైళ్లు కావాలని డిమాండ్ చేస్తూ, సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం రైల్ నిలయం వద్ద బుధవారం ధర్నా చేసిన కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాన్ని తెలంగాణ తెలంగాణ బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్. వి. సుభాష్గురువారం తీవ్రంగా విమర్శించారు.ప్రత్యేక రైలు బుకింగ్‌లకు ముందస్తు ప్రణాళిక, నిర్దేశించిన లాంఛనాలను పాటించడం అవసరమని ఎత్తి చూపుతూ, రైల్వే విధానాలపై ప్రతిపక్షానికి ఉన్న అవగాహనను బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి మరియు మీడియా ఇన్‌చార్జ్ ఎన్. వి. సుభాష్ ప్రశ్నించారు. "ఆరు దశాబ్దాలుగా దేశాన్ని పాలించిన పార్టీ, ప్రత్యేక రైళ్ల బుకింగ్‌కు సంబంధించిన ప్రాథమిక విధానాల గురించి తమకు తెలియదని ఎలా చెప్పగలదు? అటువంటి అభ్యర్థనలను అవసరమైన ముందస్తు నోటీసు మరియు ఆమోదాలతో, ఐఆర్‌సిటిసి ఫుల్ టారిఫ్ రేట్ (ఎఫ్‌టిఆర్) సౌకర్యంతో సహా, నిర్దేశిత భారతీయ రైల్వే మార్గాల ద్వారానే పంపాలి," అని ఆయన అన్నారు.రాజకీయ వివాదాన్ని సృష్టించేందుకు కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు చేస్తున్న మరో ప్రయత్నమే ఈ నిరసన అని సుభాష్ ఆరోపించారు. ఈ అభ్యర్థనను తిరస్కరించాలని రైల్వేలను ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదేశించారని సూచిస్తూ, ఆయన వారిపై నిందలు మోపారు.

పండుగ సీజన్‌లో జాతీయ రాజధానిలో పదేపదే జరుగుతున్న రాజకీయ ఆందోళనల ప్రభావం వ్యాపారులపై పడుతోందన్న వార్తలపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

నవరాత్రి, దసరా పండుగల సమయంలో వ్యాపార నష్టాలపై ఢిల్లీ వ్యాపారులు చేసిన విజ్ఞప్తులను ప్రస్తావిస్తూ, సామాన్య ప్రజలు, చిన్న వ్యాపారాలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను రాజకీయ పార్టీలు విస్మరించకూడదని ఆయన అన్నారు.

దీపావళి సమీపిస్తుండటంతో, పండుగ రద్దీని నియంత్రించడానికి రైల్వే ఇప్పటికే ప్రత్యేక సర్వీసులను నడుపుతోందని, ఈ నేపథ్యంలో ప్రతిపక్షం ప్రత్యామ్నాయాలను అన్వేషించి ఉండవచ్చని, కార్యాచరణ సాధ్యత, రైల్వే ఆమోదానికి లోబడి అదనపు కోచ్‌లను అభ్యర్థించడం వంటి మార్గాలను అన్వేషించి ఉండవచ్చని సుభాష్ అన్నారు.

"ఎలాంటి పరిష్కారాలు చూపని రాజకీయ నాటకాలతో ప్రజలు విసిగిపోతున్నారు. పదేపదే ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తగిలిన తర్వాత ఆత్మపరిశీలన చేసుకోకుండా, కాంగ్రెస్ నిరసనలు, నిందారోపణలకే పరిమితమవుతోంది," అని ఆయన అన్నారు. ఓటర్ల అసంతృప్తికి నిదర్శనంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ ఇటీవలి పనితీరును ఆయన ఉదహరించారు. పరిపాలనా నిర్ణయాలను రాజకీయం చేసి, పండుగల సమయంలో ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా, నిర్ధారిత విధానాలను అనుసరించాలని సుభాష్ ప్రతిపక్షాన్ని కోరారు.

మల్లన్న సాగర్ రిజర్వాయర్ కట్టను సందర్శించిన మాజీ మంత్రి, బీఆర్‌ఎస్‌ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు.

సిద్దపేట మాజీ మంత్రి, బీఆర్‌ఎస్‌ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు గురువారం తిప్పారం దగ్గర మల్లన్న సాగర్ రిజర్వాయర్ కట్టను సందర్శించారు. తిప్పారం వద్ద పైప్‌లైన్ల కోసం అనధికారికంగా బ్లాస్టింగ్స్ చేస్తుండటంతో మల్లన్న సాగర్ కట్ట దెబ్బతినే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఫిర్యాదు చేసారు. తిప్పారం గ్రామస్తుల సమాచారంతో మల్లన్న సాగర్ వద్దకు చేరుకుని కట్టను, బ్లాస్టింగ్స్ జరుగుతున్న ప్రాంతాన్ని అయన పరిశీలించారు. హరీశ్ రావు వెంట ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ చైర్మన్లు వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, బక్కి వెంకటయ్య, స్థానిక నాయకులు, తిప్పారం గ్రామస్తులు ఉన్నారు.హరీష్ రావు మాట్లాడుతూ మల్లన్న సాగర్ కూల్చాలని కుట్ర చేస్తున్నారా ? కట్టపక్కనే అనధికారికంగా బ్లాస్టింగ్ ఎలా చేస్తారు ? మేడిగడ్డ చేసినట్లు ఈ ప్రాజెక్ట్ ను చేయాలని చేస్తున్నారా అని ప్రశ్నించారు.

పోలీస్ స్మారక దినోత్సవం సందర్భంగా రక్తదానం

హైద్రాబాద్ అక్టోబర్ 29:పోలీస్ స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకునిఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, ఉస్మానియా విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ అవినాష్ కుమార్, ఏసీపీ శ్రీనివాస్, చిల్కలగూడ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.జగన్ రెడ్డి,సికింద్రాబాద్ జోన్ ట్రాఫిక్ సిబ్బంది మరియు స్థానిక పౌరులు పాల్గొన్నారు.

బియ్యం ధరల మోత.. సామాన్యుడికి భారమే!

(హెచ్. ప్రతాప్)

పేదవాడి ఆకలి తీర్చే అన్నమే అందనంత ఎత్తుకు చేరితే, సామాన్యుడి జీవితానికి అంతకంటే పెద్ద పరీక్ష మరొకటి ఉండదు. నిన్నటివరకు సంచుల లెక్కన కొనుగోలు చేసిన కుటుంబాలు నేడు కిలోల లెక్కన ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. తెలంగాణలో కొన్ని రకాల సన్నబియ్యం ధరలు కిలో వంద రూపాయలు దాటడం మధ్యతరగతి, అల్పాదాయ కుటుంబాలను కలవరపరుస్తోంది. కేడియా జైశ్రీరామ్ బియ్యం కిలో రూ.101కు చేరినట్లు వెలువడిన వార్తలు నిత్యావసర వస్తువుల ధరలపై కొత్త చర్చకు దారితీశాయి.

తెలుగు కుటుంబాల ఆహారంలో అన్నానికి ప్రత్యేక స్థానం ఉంది. రోజుకు రెండుపూటలా అన్నం తినే కుటుంబాలకు బియ్యం ధరల పెరుగుదల నేరుగా నెలవారీ ఖర్చును ప్రభావితం చేస్తుంది. ఐదుగురు సభ్యుల కుటుంబానికి నెలకు 30 కిలోల బియ్యం అవసరమనుకుంటే, కిలో రూ.60 ఉన్నప్పుడు రూ.1,800 ఖర్చవుతుంది. అదే ధర రూ.100కు చేరితే రూ.3,000 వెచ్చించాల్సి వస్తుంది. అంటే ఒక్క బియ్యంపైనే నెలకు అదనంగా రూ.1,200 భారం పడుతుంది. పరిమిత ఆదాయంతో జీవించే కుటుంబాలకు ఇది చిన్న మొత్తం కాదు.

బియ్యం ధరల పెరుగుదల వెనుక అనేక కారణాలు ఉంటాయి. వరి సాగు వ్యయం, కూలీల వేతనాలు, రవాణా ఛార్జీలు, నిల్వ ఖర్చులు, మార్కెట్‌లో డిమాండ్, సరఫరా పరిస్థితులు ధరలను ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా నాణ్యమైన సన్నబియ్యానికి వినియోగదారుల నుంచి అధిక ఆదరణ ఉండటంతో కొన్ని ప్రత్యేక రకాల ధరలు మరింత పెరుగుతున్నాయి. అయితే అన్ని రకాల బియ్యం ధరలు ఒకే స్థాయిలో లేవనే విషయాన్ని కూడా గుర్తించాలి.

ధరల స్థిరీకరణలో రైతులు, మిల్లర్లు, టోకు వ్యాపారులు, చిల్లర వర్తకులు పరస్పర సహకారంతో వ్యవహరించడం అవసరం. సరఫరా వ్యవస్థలో పారదర్శకత, నాణ్యతకు తగిన ధర, సమర్థమైన నిల్వ నిర్వహణ మార్కెట్‌లో సమతుల్యతకు దోహదపడతాయి. కృత్రిమ కొరతకు అవకాశం లేకుండా వ్యాపార వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. వినియోగదారులు కూడా నాణ్యత, ధరలను పోల్చుకొని కొనుగోలు చేయడం ప్రయోజనకరం.

బియ్యం ధరల పెరుగుదల ఆహార అలవాట్లపైనా ప్రభావం చూపుతుంది. కొందరు కుటుంబాలు నాణ్యమైన బియ్యానికి బదులుగా తక్కువ ధర రకాలను ఎంచుకోవాల్సి వస్తుంది. మరికొందరు ఇతర నిత్యావసరాల ఖర్చులను తగ్గించుకుంటారు. ముఖ్యంగా పిల్లల చదువు, వైద్యం, పోషకాహారం కోసం కేటాయించే మొత్తంలో కోత విధించాల్సి రావడం ఆందోళనకరం.

అన్నం కేవలం ఆహారం కాదు. కోట్లాది కుటుంబాల జీవనాధారం, ఆహార భద్రతకు ప్రతీక. రైతుకు గిట్టుబాటు ధర లభించాలి. వ్యాపారానికి సముచిత లాభం ఉండాలి. అదే సమయంలో సామాన్యుడికి అందుబాటు ధరలో నాణ్యమైన బియ్యం దొరకాలి. ఈ మూడు ప్రయోజనాల మధ్య సమతుల్యత ఏర్పడినప్పుడే ఆహార మార్కెట్‌లో నిజమైన స్థిరత్వం సాధ్యమవుతుంది.

కడుపునిండా అన్నం తినడానికి కూడా లెక్కలు వేసుకోవాల్సిన పరిస్థితి రాకూడదు. అన్నం విలాసవస్తువుగా మారకుండా చూడటమే సమాజ సంక్షేమానికి అసలైన కొలమానం.

వెలుగుమట్ల కాలనీ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు నవంబర్ నెలాఖరు లోగా పూర్తి చేయాలి...

రాష్ట్ర మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు వెలుగుమట్ల కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఆకస్మికంగా పరిశీలించిన మంత్రి

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 29:వెలుగుమట్ల కాలనీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు కాలనీలో చేపడుతున్న అన్ని మౌళిక వసతుల పనులను నవంబర్ నెలాఖరు లోగా యుద్ధపతిపాదన పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం వెలుగుమట్ల కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి మంత్రి ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ

వెలుగుమట్ల కాలనీలో నిర్మాణాలు మౌళిక వసతులతో సహా పూర్తి కావాలన్నారు. ప్రతి ఇంటి నిర్మాణ స్థితిగతులు, ప్రస్తుతం జరుగుతున్న పనులు, పూర్తికావాల్సిన పనులు, పనుల పురోగతి వివరాలను అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. అధికారులు ప్రతి రోజూ పనులను, ఇళ్ల నిర్మాణాల పురోగతిని పర్యవేక్షించాలన్నారు. నిర్మాణాల్లో ఎటువంటి సమస్య వచ్చిన అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. ఇళ్ల నిర్మాణంతోపాటు బస్తీ దవాఖానా, పాఠశాలల నిర్మాణాలు, రహదారులు, డ్రైనేజీలు తదితర మౌళిక వసతుల పనులను పూర్తి చేయాలని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంటపల్లిలో తాగునీటి కోసం మహిళల ఆందోళన

మంచిర్యాల గ్రామలలో తాగునీటి కోసం నిరసనలు ప్రారంభమయ్యాయి. చెన్నూరు మండలం ఎర్రగుంటపల్లిలో తాగునీటి బోరు మోటారును తొలగించారని ఆరోపిస్తూ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. కాంగ్రెస్ సర్పంచ్ భర్త రామయ్య మోటారును తొలగించారని గ్రామస్తుల ఆరోపణ. మోటారును తిరిగి ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఖాళీ బిందెలతో అందోళన చేసారు.

మున్సిపల్ అధికారుల ఘెరావు

గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 29 అక్టోబర్ 2026మణికొండ ఎంప్లాయిస్ కాలనీ వద్ద ఉన్న పందెమువాగు మొదలు పెట్టి జండా కూడలి, హ్యూడా కాలనీ, మణికొండ క్వార్టర్స్, అంబయన్స్ కోర్టు వరకూ త్రవ్వకాలు మొదలు పెడుతున్న సందర్భంగా అందుకు విరుద్ధంగా పందెమువాగు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రెండవ రోజు గురువారంన కూడా స్థానికులు రాజకీయలకు అతీతంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. పరిష్కార నిమిత్తం మున్సిపల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శంకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శిరీష, డిప్యూటీ ఇంజనీర్ లు కార్తీక్, అన్వేస్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ లు సంతోష్, శ్రీనిస్, అరునోదయ తదితర అధికారులు స్పందించి స్థల పరిశీలన నిమిత్తం రావడం అందుకు స్థానిక ప్రజల ఇతి బాధలు గమనించి త్రవ్వకాలు ఆపాలని ప్రదేయపడడం జరిగినను, అధికారులు అంగీకరించకుండా, మొండి వైఖరి వహించి త్రవ్వకాలు కోనసాగిస్తామనీ తెలిపినందు వలన గత్యంతరంలేక స్థానికులు ఘెరావు చేయడం, పరిష్కార మార్గంగా: విచ్చేసిన అధికారులు పై అధికారులను కలువమనీ సూచిస్తు అంతవరకూ త్రవ్వకాలు ఆపుతామనీ అంగీకరించడం జరిగినది. వాస్తవానికి గత ఎన్నికల సమయంలో స్థానిక ఎమ్మెల్యే ప్రజా వ్యతిరేక విధానాలను చేపట్టనని, పై పెచ్చు బాక్స్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తానని వాగ్దానం చేయడం జరిగింది. ఓడెక్కె వరకూ ఓడ మల్లన్న, ఓడ దిగినాక బోడ మల్లన్న అన్న చందాన ప్రస్తుత తరుణంలో ప్రధాన అనుచర నాయకుడి కల్ల బొల్లి మాటలు విని, వాటిని నమ్మి ప్రజా సౌకర్య కార్యక్రమలను, వాగ్దానంలను తుంగలో తొక్కడం ఆనవాయితీగా మారింది. మొదటికే వర్షాలు లేని ఇట్టి విపత్కర పరిస్థితిలో మణికొండలోని 40 అడుగుల రహదారిపై నిర్మాణంలో ఉన్న వర్షపు నీటితో పాటు మురుగునీటితో నిండిన నీటిని పందెమువాగు నాలాలోకి మళ్లించకుండా, తనాషా హుడా కాలనీ, ఎంప్లాయిస్ కాలనీ, అంబియెన్స్ కోర్ట్యార్డ్ లలోని పబ్లిక్ పార్కులకు మళ్లించి భూగర్భ జలాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి. వర్షంనీటి పారుదల (స్ట్రామ్ వాటర్ డ్రైన్) పేరుతో పైప్ లైన్ వేయడం అందుకు భిన్నంగా పెద్ద అపార్టమెంట్ వాళ్ల డ్రైనేజీ లైన్ లు కలుపడం ఎంతవరకు సమంజసమని పందెమువాగు నాలాలోకి వదిలేయడం వల్ల భూగర్భ జలాల పునరుద్ధరణకు ఉన్న అవకాశాన్ని కోల్పోతున్నామని స్థానికులు అధికారులను నిలదీస్తు విషయ పరిజ్ఞానం మేరకు ఇట్టి పని గతంలో లక్ష్మి నగర్, అలకాపరి మాదిరిగా పూర్తిగా డ్రైనేజ్ వ్యవస్థకు దారి తీసే అవకాశం మెండుగా ఉన్నధని, సంబంధిత పని మొత్తం స్థానిక ఎమ్మెల్యే ప్రధాన అనుచరుని కనుసన్నలలో సాగుతున్నధని స్థానికులు దుమ్మెత్తి పోస్తూన్నారు. ప్రజా వ్యతిరేక పనులను వెంటనే ఆపాలని స్థానిక ఎమ్మెల్యే మరియు అతని ప్రధాన అనుచరులకు హితవు పలికారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో ప్రభావం వల్ల తాగునీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు నవంబర్ 1 నుండి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ స్థలాలలో తాగునీటి (నాన్-పొటబుల్) అవసరాల కోసం 100 శాతం శుద్ధి చేసిన నీటినే వాడాలని ప్రభుత్వం జీవో లేదా అధికారిక ప్రకటన జారీ చేయనుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో తెలియ పరుస్తు, జలమండలి ఆధ్వర్యంలో ప్రస్తుతం 26 ఎస్టీపీల నుండి సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని ఉచితంగా సరఫరా చేస్తోందని కీలక ఆదేశాలు జారీ చేసింది మరియు నిర్మాణ అనుమతులు ఇచ్చేటప్పుడే ట్రీటెడ్ వాటర్ వాడకాన్ని తప్పనిసరి చేస్తూ రూల్స్ కఠినతరం చేస్తున్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించాలి

బాలల రక్షణ చట్టాలపై న్యాయమూర్తుల సూచనలు

జహీరాబాద్, అక్టోబరు 29 ప్రజా బలం ప్రతినిధి: బాలల రక్షణ, హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో సురక్ష బచపన్ అభియాన్‌లో భాగంగా గురువారం పలు పాఠశాలల్లో చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. అల్లీపూర్‌లోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ జి. కవితాదేవి, షాహీన్ పాఠశాలలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మొహమ్మద్ ఖలీల్,

భవన్స్ పాఠశాలలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బ్లెస్సి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. పెద్దలను, తోటివారిని గౌరవించాలని, విద్యతోపాటు సాధారణ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాని సాధనకు ఉపాధ్యాయుల సహకారం తీసుకుంటూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎలాంటి వ్యసనాలకు లోనుకాకుండా భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. బాలికలు, మహిళల పట్ల అసభ్యంగా లేదా దురుసుగా ప్రవర్తిస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని న్యాయమూర్తులు హెచ్చరించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. లైంగిక నేరాల నుంచి బాలలను రక్షించే చట్టాలు, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంబంధించిన చట్టాల గురించి వివరించారు. ముఖ్యంగా విద్యార్థినులు లైంగిక వేధింపులకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమాల్లో న్యాయవాదులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలపై

ముఖ్యమంత్రికి ఉత్తరాల పోస్ట్

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 29 ములుగు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ లో పనిచేస్తున్న 17,000 మంది అన్ని క్యాడర్ల ఉద్యోగులు రాష్ట్రవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడంతో ఈ నెల 13 నుంచి మొదలైన నిరవాదిక సమ్మె ములుగులో డాక్టర్ నరహరి ఆధ్వర్యంలో 17వ రోజు సమ్మె ప్రారంభించారు ఈరోజు ప్రత్యేకించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారికి ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలపై సమస్యల పరిష్కారానికై మంత్రి గారికి ఉత్తరాలతో తమ సమస్యలు తెలపడానికి ఉత్తరాల ప్రదర్శన కార్యక్రమాన్ని మొదలుపెట్టారు అలాగే ప్రతి ఒక్క ఎన్ హెచ్ ఎం ఉద్యోగి సమస్యలు తెలిసే విధంగా ప్రతి ఒక్కరూ రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి ఉత్తరాల ధార తెలియ పరచాలనే ఉద్దేశంతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు కరోనా మహమ్మారి సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కరోనా బాధితుల కోసం అహర్నిశలు శ్రమించి వారిని బ్రతికించిన పరిస్థితి ప్రతి ఒక్కరికి తెలుసు అలాంటి మహమ్మారి జబ్బు నుంచి ప్రజలను కాపాడిన ఉద్యోగులకు మాత్రం చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారమై రోడ్డుపై ఈరోజు సమ్మెకు దిగడం జరిగింది ప్రభుత్వాలు మారిన ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల బ్రతుకులు మారలేదని వాపోయారు ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల సమస్యలు పరిష్కరించి అన్ని క్యాడర్లకు జీతాలు పెంచి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గారిని కోరుతున్నారు

ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యులు స్టాఫ్ నర్సులు జూనియర్ అసిస్టెంట్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సపోర్టింగ్ స్టాప్ సెక్యూరిటీ గార్డ్స్ శానిటేషన్ వర్కర్స్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు

తక్కువ వర్షపాతంలో ఉద్యాన పంటల సంరక్షణపై అవగాహన

మల్చింగ్‌కు ఎకరానికి రూ.8 వేల సబ్సిడీ

జహీరాబాద్, అక్టోబరు 29 ప్రజా బలం ప్రతినిధి: తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో ఉద్యాన పంటలను సంరక్షించుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వరరావు రైతులకు సూచించారు. కోహిర్ మండలం వెంకటాపూర్ రైతు వేదికలో గురువారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయిల్‌పామ్, ఆలు పంటల్లో నీరు, ఎరువులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. డ్రిప్ సేద్యం ద్వారా నీటిని పొదుపు చేయాలని తెలిపారు. మల్చింగ్ విధానంతో నేలలో తేమను కాపాడుకోవచ్చని, ఈ విధానాన్ని ప్రోత్సహించేందుకు అర్హులైన రైతులకు ఎకరానికి రూ.8 వేల సబ్సిడీ అందిస్తున్నట్లు వెల్లడించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా కూరగాయల నారును సబ్సిడీపై అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జహీరాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు వైద్యనాథ్ మాట్లాడుతూ.. పంటల అవసరాలకు అనుగుణంగా నీరు, ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణంను పరామర్శించిన

కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ లోకేష్ యాదవ్

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 29:ఉమ్మడి ఖమ్మం జిల్లాకు డీసీసీబీ చైర్మన్ గా పని చేసిన టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మరియు యాదవ సంఘం నాయకులు కూరాకుల నాగభూషణం యాదవ్ ఇటీవల అనారోగ్యంతో హాస్పిటల్లో జాయిన్ అయి ఇంటికి వచ్చిన క్రమంలో ఈరోజు టి పి సి సి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ లోకేష్ యాదవ్ పరామర్శించి యోగ క్షేమాలు తెలుసుకొని త్వరగా కోలుకొని జన జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు

ఈ సందర్భంగా పలు కీలకమైన రాజకీయ అంశాలు చర్చకు వచ్చాయి. చట్టసభల్లో బీసీ ల ప్రాతినిధ్యం కొరకు 60 శాతం ఉన్న బీసీ లు పార్టీలకతీతంగా ఐక్యం కావాల్సిన అవసరం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారుఈ కార్యక్రమం లో పాల్గొన్న నాయకులు మూడు ముంతల గంగరాజు యాదవ్, సత్తి వెంకన్న యాదవ్, గుమ్మా రోశయ్య యాదవ్, సింగాల భిక్షం యాదవ్, నాగరాజు యాదవ్, చిత్తారు శ్రీను యాదవ్, సైదులు యాదవ్, సతీష్ యాదవ్, గంగాధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

నేటి ఆవిష్కరణ.. రేపటి భవిష్యత్తు

'ఇంటింటా ఇన్నోవేటర్'పై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ బోర్డడే హేమంత్ సహదేవరావు

ములుగు జిల్లా ప్రజా బలం ప్రతినిధి అక్టోబర్ 29 ములుగుగురువారం ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు అధ్యక్షతన నిర్వహించిన లిఇన్నోవేషన్ పంచాయతీ కార్యక్రమానికిలి జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నేటి ఆవిష్కరణలే రేపటి భవిష్యత్తుకు పునాదులని అన్నారు. గ్రామీణ ప్రజలు తమ అనుభవాల ఆధారంగా దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యలకు కనుగొనే పరిష్కారాలను గుర్తించి, వాటిని మరింత మందికి ఉపయో గపడేలా ప్రోత్సహించాలని సూచించారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, యువత, చేతివృత్తిదారుల్లోని సృజనాత్మకతను వెలుగులోకి తీసుకురావాలన్నారు.

ఆవిష్కరణలు పెద్ద పరిశోధనా కేంద్రాలకే పరిమితం కావని, ప్రతి ఇంట్లోనూ కొత్తగా ఆలోచించే ప్రతిభ ఉంటుందని పేర్కొన్నారు. ఆలోచన చిన్నదైనా ప్రజల శ్రమను తగ్గించి, సమయం, ఖర్చును ఆదా చేయగలిగితే అది సమాజానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. వ్యవసాయం, నీటి పొదుపు, పారిశుద్ధ్యం, చేతివృత్తులు, రోజువారీ పనులను సులభతరం చేసే వినూత్న ఆలోచనలను గుర్తించాలని సూచించారు.

తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో అమలవుతున్న 'ఇంటింటా ఇన్నోవేటర్' కార్యక్రమంపై గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. వయస్సు, చదువుతో సంబంధం లేకుండా ప్రజలు తమ ఆలోచనలను ముందుకు తీసుకువచ్చేలా ప్రోత్సహించాలన్నారు. స్థానికంగా రూపొందించిన పరికరాలు, వినూత్న పని విధానాలు, వాటి ఉపయోగాలను గుర్తించి సంబంధిత వివరాలను సేకరించాలని సూచించారు.

ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోని ఆవిష్కర్తలను గుర్తించడంలో చొరవ చూపాలని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు తమ పరిసరాల్లోని సమస్యలను పరిశీలించి, వాటికి పరిష్కారాలు ఆలోచించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఉపయోగకరమైన ఆవిష్కరణలను మరింత మెరుగుపరిచేందుకు సంబంధిత విభాగాలతో సమన్వయం చేసి, తగిన మార్గదర్శకత్వం అందేలా కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ప్రతినిధి సోహెల్, నుంచి అమృత, ప్రాజెక్ట్ లీడ్ విజయ్, సిద్ధార్థ రెడ్డి, గ్రాస్‌రూట్స్ లీడ్ రమేష్ పాల్గొన్నారు. వీరు గ్రామీణ ప్రాంతాల్లోని ఆవిష్కర్తలను గుర్తించడం, స్థానిక సమస్యలకు పరిష్కారాలను ప్రోత్సహించడం, వినూత్న ఆలోచనలకు తగిన మార్గదర్శకత్వం అందించడం వంటి అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, ఈ డి ఎం దేవేందర్, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పలు సమస్యలపై అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేసిన ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు

ఏటూరు నాగారం మండల కేంద్రంలో పలు గ్రామాలలో ఉండబడిన సమస్యల గురించి వివిధ శాఖల అధికారులకు కలిసి వినతి పత్రాలను అందజేసిన కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు. అధికారులు సానుకూలంగా స్పందించి మీ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియ చేసినారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు

భూ పునఃసర్వే పక్కాగా చేపట్టాలి

డబీల్‌పురాలో పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం అక్టోబర్ 29: భూ పునఃసర్వేను పారదర్శకంగా, పక్కాగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం మేడ్చల్ మండలం డబీల్‌పురా గ్రామంలో జరుగుతున్న భూ సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పట్టాదారు పాస్‌పుస్తకాల్లో నమోదైన భూ ఆధార్ సంఖ్య ఆధారంగా అంతర్జాలంలో భూమి ఉన్న ప్రదేశాన్ని గుర్తిస్తున్నట్లు తహసీల్దార్ వివరించగా, అదనపు కలెక్టర్ ఈ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. సర్వే జరుగుతున్న ప్రాంతంలో రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా పనులు చేపట్టాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఈ పర్యటనలో భూ సర్వే, భూ రికార్డుల సహాయ సంచాలకుడు శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కుమార్, సర్వే బృందం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఏపీలో 13 కార్పొరేషన్లలో కూటమిదే ఆధిక్యం.. సర్వే అంచనా

హైదరాబాద్ ఆంధ్రప్రదేశ్‌లో 87 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లకు జరగనున్న ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందని ఒక సర్వే అంచనా వేసింది. మొత్తం 13 కార్పొరేషన్లలోనూ మేయర్ స్థానాలను కూటమి కైవసం చేసుకునే అవకాశాలున్నాయని పేర్కొంది. 886 డివిజన్లలో 860 స్థానాల్లో కూటమి అభ్యర్థులు, 22 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా కర్నూలు కార్పొరేషన్‌లో పోటీ తీవ్రంగా ఉంటుందన్న ప్రచారం నేపథ్యంలో నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో యువత, మహిళల్లో కూటమికి అనుకూలత కనిపించిందని తెలిపింది. కర్నూలులోని 68 డివిజన్లలో ఒకటి ఇప్పటికే ఏకగ్రీవం కాగా, మిగిలిన స్థానాల్లో కూటమి అభ్యర్థులు ఆధిక్యం సాధించే అవకాశాలున్నాయని, ఎనిమిది డివిజన్లలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని సర్వే అంచనా వేసింది.

విద్యార్థులకు 21 రకాల సదుపాయాలు 100 శాతం అందేలా చూడాలి: ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 29 తాడ్వాయి తాడ్వాయి మండలంలోని మండల వనరుల కేంద్రాన్ని (ఎం ఆర్ సి) ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సందర్శించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన హాస్టల్ విద్యార్థులకు పంపిణీ చేస్తున్న విద్యార్థుల అవసర వస్తువులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన యూనిఫాం వస్త్రాలు, ఐడీ కార్డులు, బెల్టులు, బ్లాక్ షూస్, వైట్ షూస్, సాక్సులు, ట్రాక్ షూస్, స్కూల్ బ్యాగులు, బెడ్‌షీట్లు, ప్లేట్లు, గ్లాసులు, ట్రంక్ బాక్సులు, దుప్పట్లు, నైట్ డ్రెస్‌లు తదితర 21 రకాల వస్తువుల పంపిణీ వివరాలను పరిశీలించారు.

ప్రతి విద్యార్థికి నిర్దేశించిన అన్ని వస్తువులు పూర్తిస్థాయిలో అందాయా లేదా రికార్డుల ద్వారా ధృవీకరించాలని, అర్హులైన విద్యార్థులందరికీ 100 శాతం వస్తువులు అందేలా చర్యలు తీసుకోవాలని పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సూచించారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండల సమస్యలపై సర్వసభ్య సమావేశాల ఏర్పాటు

గౌరవ మంత్రివర్యులు సీతక్క గారి ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి పాలన మండలసర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు

ములుగు జిల్లా ప్రజాబలం ప్రతిని ధి అక్టోబర్ 29 ఏలూరు నాగారం గురువారం ఏటూర్ నాగారం మండల ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశము ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశానికి ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు మరియు మండల తహసిల్దార్ గుర్రం జగదీష్ హాజరైనారు. అదేవిధంగా మండలంలో ఉన్న వివిధ శాఖల అధికారులు,

గ్రామ సర్పంచులు గ్రామ కార్యదర్శులు, తో పాటు ఎంఈఓ , అగ్రికల్చర్, ఏడి ఐసిడిఎస్, వి బి జి రామ్ జి ఆర్డబ్ల్యూఎస్ ఐబి మహిళా సమాఖ్య ఏపిఎం, ఎలక్ట్రిసిటీ, ఇంజనీరింగ్, వెటర్నరీ, హెల్త్ సెంటర్, వివిధ శాఖల అధికారులు హాజరైనారు.

ఈ సమావేశం నాలుగు గంటల పాటు గ్రామాలలో ఉండబడిన సమస్యలపై అదేవిధంగా ఎల్ నినో ప్రభావం తో రైతులకు, ప్రజలకు సాగునీరుకు తాగునీరు గూర్చి పూర్తి అవగాహన కల్పించి నీటిని ఎలా ఆదా చేయాలి ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలి పశువులకు నీటి కొరత ఉండకుండా నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలి.

వి బి జి రామ్ జి ద్వారా గ్రామంలో ఉండబడిన సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

నీటిని నిల్వ చేస్తాడం కోసం ఇంటి కుంట కోరుకుంటా పంట కుంట ఇంకుడు గుంతలను పాము ఫండ్స్ ను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు.

కరెంటును కూడా ఆధా చేసుకునే విధంగా ప్రజలు రైతులు వ్యవహరించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ గ్రామాలలో ఉండబడిన సమస్యలను మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో ముఖ్య అతిథుల సమక్షంలో అధికారుల దృష్టికి తీసుకొని పోయి పరిష్కరించుకునేందుకు గ్రామ సర్పంచులకు ప్రజలకు దోహదపడుతుందని అన్నారు

ప్రతి సమస్యను సంబంధిత మండల అధికారుల దృష్టికి తీసుకొని పోయి వెంటనే పరిష్కరించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తుందని అన్నారు. అధికారులందరూ సమన్వయంతోని మండల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని తెలియజేసినారు

ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు సర్పంచులు కార్యదర్శులు పాల్గొన్నారు

నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు

ఎల్లంపేట పరిసర గ్రామాల యువతకు మెగా ఉద్యోగ మేళా

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం అక్టోబర్ 29:లి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు మంచి అవకాశం. అర్హులైన వారికి ఉపాధి కల్పించే లక్ష్యంతో ఈ నెల 31న ఎల్లంపేటలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం. కల్పన తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎల్లంపేటలోని సోనా ఫంక్షన్ హాల్‌లో ఉద్యోగ మేళా కొనసాగనుంది. ఇందులో 14 ప్రముఖ సంస్థలు పాల్గొని వివిధ విభాగాల్లో అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. లూలూ గ్రూప్, అపోలో ఫార్మా, టెక్ మహీంద్రా, కేవా గ్రూప్, రెకాన్, ష్నైడర్ తదితర సంస్థల్లో ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉండనున్నాయి. ఉద్యోగాల కోసం ఆసక్తి ఉన్న యువత తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, వ్యక్తిగత వివరాల పత్రం, ఆధార్ కార్డుతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాల కోసం 9866465024, 7842617596 నంబర్లను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఎం.రాధిక తెలిపారు.

మండలంలో జెడ్పిటిసి ,ఎంపీటీసీ ఎన్నికల ప్రచారం జోరు

నందవరం మండల పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల సమరం ప్రచార ఘట్టానికి చేరుకోవడంతో తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థులు విస్తృత ప్రచారంతో మండలంలో వివిధ గ్రామాల్లో టీడీపీ అభ్యర్థుల ప్రచార హోరు సైకిల్ నినాదంతో జోరుగా సాగుతుంది. ఎమ్మిగనూరు శాసనసభ్యులు డాక్టర్ బి.వి.జయనాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ అభ్యర్థులు తమ తమ ప్రాదేశిక నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలు, వార్డులు, కాలనీలలో విస్తృతంగా పర్యటిస్తూ విజయం కోసం శ్రమిస్తున్నారు. నందవరం ? 1 ఎంపీటీసీ బోయ వీరేష్, నందవరం-2 ఎంపీటీసీ నాగలక్ష్మి,నందవరం-3 ఎంపీటీసీ ఎస్ లలితమ్మ, హాలహర్వి-1 ఎంపీటీసీ బోయ రాఘవేంద్ర, హాలహర్వి-2 ఎంపీటీసీ బోయ శ్రీనివాసులతోపాటు తదితరు ఎంపీటీసీ స్థానాల్లో కూడా తెలుగు తమ్ముళ్ల ప్రచారం పతాక స్థాయికి చేరింది. అభ్యర్థులు తమకు కేటాయించిన స్థానాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్ దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రచారంలో భాగంగా అభ్యర్థులు ప్రజలకు పలు అభివృద్ధి సంక్షేమ వాగ్దానాలు చేశారు. గ్రామాల్లో ఏళ్ల తరబడి నెలకొన్న తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపుతామని, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను యుద్ధప్రాతిపదికన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పార్టీలకు అతీతంగా నేరుగా చేరవేస్తామని, పారిశుధ్య సమస్యలు లేకుండా పల్లెలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుతామని ఓటర్లకు భరోసా ఇచ్చారు.

అందోల్ జోగిపేట మున్సిపల్ రూపురేఖలు మారుస్తాం

ప్రతి కుటుంబానికి అండగా ఉండటమే నా లక్ష్యం

అందోల్ జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ చిట్టిబాబు

అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 29 (ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా ఎన్నడూ లేని అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన

తర్వాత, మంత్రి దామోదర్ రాజనర్సింహ, అందోల్ రూపురేఖలు మారుస్తున్నాడని, అందోల్ -జోగిపేట, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ, (చిట్టిబాబు) అన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, దామోదర్ రాజనర్సింహ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత, మంత్రి పదవి ఏశాఖను అయితే దామోదర్ రాజనర్సింహకు, కట్టబెడుతుందో, ఆ శాఖకు తగ్గట్టు పనులు చేసే వ్యక్తి మంత్రి దామోదర్ రాజనర్సింహ, అని ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు)అన్నారు, విద్యాశాఖ హెల్త్ శాఖ కానీ,కాంగ్రెస్ ప్రభుత్వం ఏ శాఖ ఇచ్చిన, దానికి తగ్గట్టు పనిచేసే వ్యక్తి, మంత్రి దామోదర్ రాజనర్సింహని,అన్నారు, ఇలాంటి నాయకుడు మన ఆందోల్ నియోజకవర్గానికి ఉండడం మకు అదృష్టం అని తెలిపారు......

రూత్ సంకల్పం ఎందరికో స్ఫూర్తిదాయకం

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్

వివక్షను జయించి ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఎండీ పూర్తిచేసిన

దేశంలోనే తొలి ట్రాన్స్ మహిళగా ఘనత

పేదరికం నుంచి వైద్యరంగంలో చరిత్ర సృష్టించిన

రూత్ జాన్ పాల్

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 29: పేదరికం సామాజిక వివక్షను అధిగమించి వైద్యరంగంలో అరుదైన ఘనత సాధించిన ఖమ్మం నగరం రమణగుట్టకు చెందిన డాక్టర్ కొయ్యల రూత్ జాన్ పాల్ జీవన ప్రస్థానం అందరికీ స్ఫూర్తిదాయకమని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఐపీఎస్ కొనియాడారు .

58వ డివిజన్‌కు చెందిన రూత్ జాన్ పాల్ నిరుపేద దళిత కుటుంబంలో జన్మించి , ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ పట్టుదలతో చదువుకుని ఎమర్జెన్సీ మెడిసిన్‌లో ఎండీ పూర్తి చేయడం అభినందనీయమన్నారు . దేశంలోనే ఈ ఘనత సాధించిన తొలి ట్రాన్స్ మహిళగా ఆమె నిలిచారని పేర్కొన్నారు . ఒకప్పుడు వ్యవసాయ కూలీగా పనిచేస్తూ వివక్షను ఎదుర్కొన్న ఆమె , న్యాయపోరాటం చేస్తూ తన లక్ష్యాన్ని చేరుకోవడం అసాధారణ విజయమన్నారు . ప్రస్తుతం సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రి అత్యవసర విభాగంలో వైద్యురాలిగా సేవలందిస్తూ ఎంతోమంది ప్రాణాలను కాపాడుతున్నారని తెలిపారు . అడ్డంకులు ఎన్ని ఎదురైనా ఆత్మవిశ్వాసం , పట్టుదలతో ముందుకు సాగితే అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చని రూత్ జాన్ పాల్ నిరూపించారని సజ్జనార్ ప్రశంసించారు . ఆమె భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని , మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు .

కొత్తగూడెంలో కాంగ్రెస్ నూతన కార్యాలయం కోసం స్థల పరిశీలన

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 29:పట్టణంలోని రైటర్ బస్తీలో కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా కార్యాలయం నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగు లేటి శ్రీనివాసరెడ్డి గురువారం డిసిసి అధ్యక్షు రాలు దేవి ప్రసన్నతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాటా ్లడుతూ.. అతి త్వరలో నిర్మాణ పనులు చేపడ ్తామని, సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసు కుం టామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీని యర్ నాయకులు గోపాలరావు, ఆళ్ల మురళి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయ కులు తదితరులు పాల్గొన్నారు.

ప్రీ-బిడ్స్ బంద్ చేయాలి..

సుందరీకరణ పేరుతో ఆడుతున్న డ్రామా ఆపాలి కేటీఆర్

హైదరారాబాద్ రాష్ట్రంలో కరువు అంటారు. కరువు మండలాల్ని ప్రకటిస్తారు. అఖిలపక్ష సమావేశాలు పెడతారు.. మళ్లీ మూసీ సుందరీకరణ అంటారు.. ఇదేం ఆలోచన అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీసారు. ఎప్పుడైతే 'మూసీ' పేరిట లక్షన్నర కోట్ల లూటీకి ఈ సర్కార్ తెరతీసిందో.. ఆరోజు నుంచి గట్టిగా పోరాడుతున్న ఒకే ఒక్క పార్టీ బీఆర్ఎస్.

అలాంటప్పుడు పబ్లిక్ హియరింగ్‌కు బాధితుల తరఫున సబితా ఇంద్రారెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు, ఇతర బీఆర్ఎస్ నేతల్ని అరెస్ట్ చేశారు. ఈ రాష్ట్రంలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఉందా? లేక అనుముల రాసిన రాజ్యాంగం ఉందా అని అయన ప్రశ్నించారు.

మూసీ ప్రాజెక్ట్‌కు ఇంతవరకూ డీపీఆర్ లేదు. ఒకవేళ ఉంటే.. దాన్ని పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని రేవంత్ రెడ్డికి సవాల్ చేస్తున్నా. ఫేజ్-1 అంటున్నారు.. ఇలా ఎన్ని ఫేజ్‌లు చేయబోతున్నారో ఈ ప్రభుత్వం చెప్పాలి. వెంటనే ప్రీ-బిడ్స్ బంద్ చేయాలి.. సుందరీకరణ పేరుతో ఆడుతున్న డ్రామా ఆపాలని అన్నారు.

రాష్ట్రం కరువులో ఉంటే.. మూసీ సుందరీకరణ గురించి మిమ్మల్ని ఎవరు అడిగారు ? మీ దిక్కుమాలిన పాలనలో అన్నదాత ఆగమైతుంటే.. సుందరీకరణ ఎవరు అడిగారని నిలదీసారు.

ఒకవైపు రాష్ట్రం కరువుతో అల్లాడుతోంది. మరోవైపు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కానీ ఈ ముఖ్యమంత్రి మల్లన్న సాగర్ నుంచి 10 టీఎంసీల నీరు తెచ్చి మూసీ సుందరీకరణ చేస్తానంటున్నారు. బుద్ధి ఉన్న ముఖ్యమంత్రి ఇలా చేస్తారా? మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపంగి కావాలన్న చందంగా రేవంత్ తీరు ఉందని అయన విమర్శించారు.

ముఖ్యమంత్రి స్వతహాగా రియల్ ఎస్టేట్ తప్ప మరొకటి తెలియదని ఆయనే చెప్పుకున్నారు. మూసీ పేరుతో వేలాది ఎకరాల లూటీకి ముఖ్యమంత్రి తెరలేపారు. అందుకే పబ్లిక్ హియరింగ్ అంటే భయపడుతున్నారని అన్నారు.

శ్రీ సిద్ధేశ్వర స్వామి దేవస్థానంలో మూడు రోజుల ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు

హాజరు కానున్న ఉజ్జయిని జగద్గురు స్వామి, వివిధ ఆశ్రమాల స్వాములు

జహీరాబాద్, అక్టోబర్ 29 ప్రజాబలం ప్రతినిధి పట్టణంలోని శ్రీ మంగళ గౌరీ సమేత శ్రీ సిద్దేశ్వర స్వామి దేవస్థానంలో అక్టోబర్ 30వ తేదీ నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మూడు రోజుల పాటు వివిధ ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ నెల 30న ఉదయం గణపతి, పంచాచార్య అష్ట దిక్పాలక పూజ, నవగ్రహాది సర్వ దేవత హవనములు అనంతరం శ్రీ శ్రీ శ్రీ 108 వీరేశ్వర శివాచార్య మహాస్వామి చేతుల మీదుగా అయ్యచార లింగ దీక్ష మంత్రోపదేశం 31 న సంగారెడ్డి జిల్లా, రాష్ట్ర అర్చక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆరుద్రోత్సవం కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. నవంబర్ 1న ఉదయం 8 గంటలకు శ్రీమద్ 1008 ఉజ్జయిని జగద్గురువుల వారి రథోత్సవ ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ ఊరేగింపు స్థానిక రాచన్న మఠం నుండి సిద్దేశ్వర దేవస్థానం వరకు కొనసాగుతుందన్నారు.జగద్గురువుల ద్వార శ్రీ సిద్దేశ్వర స్వామివారికి అభిషేకం తదనంతరం ఇష్ట లింగ మహా పూజ, లక్ష బిల్వార్చనం, పాద పూజ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.అనంతరం 11.30 గంటలకు ముఖ్య వక్తల ప్రవచనాలు, శివాచార్యుల అనుగ్రహ భాషణములు, జగద్గురువుల అమృత ఆశీర్వచనాలు, మంగళ హారతి తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు . ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు గాను శ్రీమద్ ఉజ్జయిని సద్ధర్మ సింహనాదీశ్వర శ్రీ శ్రీ శ్రీ 1008 జగద్గురు సిద్ధం లింగ రాజ దేశీ కేంద్ర శివాచార్య భగవత్పాద మహాస్వాముల(కర్ణాటక, మధ్యప్రదేశ్ సద్ధర్మ సింహాసన మహా సంస్థాన పీఠం) దివ్య సాన్నిధ్యం, వేడుకలకు గాను బిచ్కుంద సంస్థాన మఠం శ్రీ 108 సోమలింగ శివాచార్య మహాస్వాములవారు నేతృత్వం వహిస్తారని, మొగుడంపల్లి మండలం ధనసిరి హిరేమఠం పీఠాధిపతి శ్రీ 108 వీరేశ్వర శివాచార్య విమహాస్వాములవారి పర్యవేక్షణలో కొనసాగుతాయని వివరించారు. వీరితో పాటు తంగడపల్లి శివయోగి శివాచార్య మహాస్వామి, బర్దిపూర్ వైరాగ్య శిఖామణి శ్రీ అవధూతగిరి మహారాజ్, శ్రీ మఠం రాచయ్య స్వామి (రంజోల్) శ్రీ సిద్దయ్య స్వామి (న్యామతాబాద్) లు విచ్చేయనున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు. కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు తాలూకా, పట్టణ జంగమ సమాజం,జిల్లా అర్చక సంఘం,వీరశైవ సమాజం సభ్యులు తెలిపారు.

ఉదృతంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు

20 వ వార్డ్ కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు ఆధ్వర్యంలో ఏమ్మెల్సీ ఓటనమోదు ప్రక్రియ

ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 29:వైరా మున్సిపాలిటీ, 20 వ వార్డ్ సీఎస్ సి

చర్చిసమీపంలో కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు ఆధ్వర్యంలో నల్గొండ -వరంగల్ -ఖమ్మంగ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతగా నడుస్తుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన డీసీసీ హెల్త్ సెల్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ చేసుకోవాలని తెలియజేసారు.కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి ప్రతి కార్యకర్త సైనికులా కష్టపడాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి 50 మంది పట్టభద్రులకు ఒక కార్యకర్తను సమన్వయకర్తగా నియమించి, ఓటర్ల నమోదును పర్యవేక్షించేలా ప్రణాళిక రుపొందించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైరా టౌన్ ప్రెసిడెంట్ వీరంశెట్టి సీతారాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు, సీనియర్ నాయకులు పొదిల్ల హరినాధ్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు,సుతకాని ప్రేమ్ చంద్ ,గొల్లమందలబాబు ,సుతకానిశ్రీకాంత్,విజయ్,రవితేజ,రవి,హనుమంతురావు,భరత్,వార్డ్ కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ళ రాము, బిక్యా, ఎస్కే రహీం (పండు), తేజావత్ నాగేశ్వరావు, దుర్గా ,హుస్సేన్,నవీన్ ,పృథ్వి,నిఖిల్ (చింటూ), ఖాజా,సుమన్,మంగయ్య, విజయ్,దిలీప్, నరసింహారావు, అన్వర్ ,అసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ లో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

హోటల్లు, మిఠాయి దుకాణాలు, బేకరీ, పలు ఏజెన్సీలలో తనిఖీలు

జహీరాబాద్, అక్టోబర్ 29 ప్రజాబలం ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని పలు హోటళ్లు, మెస్లు, మిఠాయి దుకాణాలు, నిత్యావసర సరుకుల ఏజెన్సీలపై జిల్లా ఫుడ్ సేఫ్టీ

అధికారి రాజేశ్వర్ నేతృత్వంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. పలు హోటళ్లలో నాణ్యత లేని, కుళ్ళిపోయిన ఆహార పదార్థాలు మరియు నిల్వ ఉంచిన కూరగాయలు అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిత్యావసర సరుకుల ఏజెన్సీ దుకాణాల్లో విక్రయిస్తున్న నాసిరకం టీ పొడిని అధికారులు సీజ్ చేశారు. పరిశుభ్రతా ప్రమాణాలు పాటించని, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న పలు హోటళ్లు, వ్యాపార సముదాయాల నిర్వాహకులకు అధికారులు తీవ్ర హెచ్చరికలతో కూడిన నోటీసులు జారీ చేశారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించేలా కల్తీ, నాసిరకం పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరించారు. ఈ దాడులతో స్థానిక వ్యాపారుల్లో వణుకు మొదలైంది.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

విశాఖపట్నం బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పాడింది. దక్షిణ అండమాన్ ప్రాంతంలో ఆవర్తనం ప్రభావంతో అల్పపీడనం ఏర్పడింది. మరో 24 గంటల్లో పశ్చిమ- వాయువ్య దిశగా కదిలే అవకాశం వుంది. అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతంలో అల్పపీడన ప్రాంతంగా మారే అవకాశం వుంది. మరో 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం వుంది.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com